JORDAR NEWS
విన్న అవినీతి అంతం - అదే మా పంతం
జోర్దార్ తెలంగాణ & ఆంధ్రప్రదేశ్
రెండు తెలుగు రాష్ట్రాల్లో ఖాళీగా ఉన్న మండలాలు, నియోజకవర్గాలు, జిల్లాల్లో జోర్దార్ దినపత్రికలో పనిచేయుటకు మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయి స్టాఫ్ రిపోర్టర్లు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి.
9848811424

RNI NO.TGTEL/25/A5224
# జోర్దార్
JORDAR TELUGU DAILY తెలుగు దినపత్రిక
అవినీతి అంతం - మా పంతం

JORDAR NEWS
విన్న అవినీతి అంతం - అదే మా పంతం
జోర్దార్ తెలంగాణ & ఆంధ్రప్రదేశ్
రెండు తెలుగు రాష్ట్రాల్లో ఖాళీగా ఉన్న మండలాలు, నియోజకవర్గాలు, జిల్లాల్లో జోర్దార్ దినపత్రికలో పనిచేయుటకు మండల, నియోజకవర్గ, జిల్లా స్థాయి స్టాఫ్ రిపోర్టర్లు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి.
9848811424

కరీంనగర్ సంపుటి : 01 సంచిక : 244 మంగళవారం, సెప్టెంబర్ 22 2026, పేజీలు - 8 వెల : 2/- epaper.jordar.com

## బోగస్ కుల సర్టిఫికెట్‌తో కొలువు కొట్టేశారా? ?

# 28 ఏళ్లుగా ప్రభుత్వ ఉద్యోగం!

- బీసీ-ఎ కోటాలో ఎంపిక.. ప్రస్తుతం బీసీ-డిగా నమోదైనట్లు సమాచారం
- పాత నియామక రికార్డులపై సమగ్ర విచారణకు డిమాండ్




**వరంగల్ జోర్దార్ నిఘా విభాగం:** రిజర్వేషన్ ప్రయోజనాలు అర్హులైన అభ్యర్థులకు దక్కాల్సిన సమయంలో తప్పుడు కుల ధ్రువీకరణ పత్రాలతో ఉద్యోగాలు పొందుతున్నారనే ఆరోపణలు అప్పుడప్పుడు వెలుగులోకి వస్తుంటాయి. తాజాగా 1996 డీఎస్సీ ఉపాధ్యాయ నియామకానికి సంబంధించిన ఓ వ్యవహారం ఇదే తరహాలో అనుమానాలకు తావిస్తోంది. అప్పటి ఎంపిక జాబితాలో బీసీ-ఎ రిజర్వేషన్ కింద ఉపాధ్యాయుడిగా ఎంపికైన ఎన్. ప్రసాదరావు ప్రస్తుతం విద్యాశాఖ రికార్డుల్లో బీసీ-డి సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిగా నమోదై ఉండటమే ఈ వివాదానికి కారణమైంది. 1996 డీఎస్సీ ఎంపిక జాబితాలో సీరియల్ నంబర్ 1215, హాల్‌టికెట్ నంబర్ 21100842తో ఎన్. ప్రసాదరావు పేరు ఉన్నట్లు సమాచారం. ఆయనను బీసీ-ఎ రిజర్వేషన్ కేటగిరీలో ఎస్జీటీ ఉపాధ్యాయుడిగా ఎంపిక చేసినట్లు ఆ రికార్డుల్లో నమోదై ఉంది. అయితే ప్రస్తుతం విద్యాశాఖకు సంబంధించిన అధికారిక రికార్డుల్లో ఆయన కులం బీసీ-డి, మున్నూరు కాపుగా నమోదై ఉన్నట్లు తెలుస్తోంది. అప్పటి ఎంపిక రికార్డుకు, ప్రస్తుత సర్వీస్ రికార్డుకు మధ్య ఉన్న ఈ వ్యత్యాసం ఇప్పుడు పలు ప్రశ్నలను లేవనెత్తుతోంది.అయితే ఈ రికార్డుల వ్యత్యాసం ఒక్కటే తప్పుడు కుల ధ్రువీకరణ పత్రం సమర్పించారనే నిర్ధారణకు ఆధారం కాదు. అసలు నియామక సమయంలో అభ్యర్థి ఏ కుల ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించారు? ఆ పత్రాన్ని ఏ అధికారి జారీ చేశారు? అప్పట్లో జరిగిన ధ్రువపత్రాల పరిశీలనలో ఏం తేలింది? అనంతరం సర్వీస్ రికార్డుల్లో బీసీ-డి వివరాలు ఎప్పుడు, ఏ ఆధారాలతో నమోదు చేశారు? అనే అంశాలపై అధికారిక విచారణ జరగాల్సిన అవసరం ఉంది.ప్రస్తుతం అందుబాటులో ఉన్న వివరాల ప్రకారం ఎన్. ప్రసాదరావు రాయపర్తి మండలంలోని ఎంపీపీఎస్ హెచ్/డబ్ల్యూ పాఠశాలలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నట్లు రికార్డులు సూచిస్తున్నాయి. 1996లో ఎస్జీటీగా నియామకమైన వ్యక్తి దాదాపు 28 ఏళ్లుగా ప్రభుత్వ సేవలో కొనసాగి ప్రస్తుతం ప్రధానోపాధ్యాయుడి స్థాయికి చేరుకోవడంతో, ఒకవేళ నియామక సమయంలో రిజర్వేషన్ అర్హతకు సంబంధించి అక్రమం జరిగినట్లు తేలితే దాని ప్రభావం మొత్తం సర్వీస్ ప్రస్థానంపై పడే అవకాశం ఉంటుంది.ఈ వ్యవహారంలో వాస్తవాలు తేల్చేందుకు 1996 నాటి అసలు దరఖాస్తు, కుల ధ్రువీకరణ పత్రం, ఎంపిక జాబితా, ధ్రువపత్రాల పరిశీలన రికార్డులు, నియామక ఉత్తర్వులు, సర్వీస్ రిజిస్టర్‌లోని సంబంధిత వివరాలను సమగ్రంగా పరిశీలించాలని బాధితులు కోరుతున్నారు. అలాగే రెవెన్యూ అధికారుల ద్వారా సంబంధిత కుల ధ్రువీకరణ పత్రం చెల్లుబాటు, జారీ విధానం, అప్పటి రికార్డులతో దాని అనుసంధానాన్ని నిర్ధారించాలని డిమాండ్ చేస్తున్నారు.నిజమైన బీసీ-ఎ అభ్యర్థికి దక్కాల్సిన రిజర్వేషన్ అవకాశాన్ని ఎవరైనా తప్పుడు ధ్రువపత్రంతో పొందినట్లు అధికారిక విచారణలో నిర్ధారణ అయితే, వర్తించే చట్టాలు, ప్రభుత్వ నిబంధనల ప్రకారం బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బాధిత వర్గాలు కోరుతున్నాయి. మరోవైపు ఆరోపణల్లో వాస్తవం లేకపోతే సంబంధిత రికార్డులను బహిర్గతం చేసి అనుమానాలకు తెరదించాలని వారు పేర్కొంటున్నారు. 28 ఏళ్ల క్రితం జరిగిన నియామకానికి సంబంధించిన ఈ వివాదంపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి అసలు నిజాలను వెల్లడించాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## భూపాలపల్లి జిల్లాలో అవినీతి ఎంపిడిఓపై

# చర్యలు తీసుకోవాలి

**భూపాలపల్లి జోర్దార్ ప్రతినిధి:** భూపాలపల్లి జిల్లాలో గత 12 నెలలుగా విధులు నిర్వహిస్తున్న మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ)పై అవినీతి, అక్రమ వసూళ్లకు సంబంధించి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిజామాబాద్ జిల్లా నుంచి బదిలీపై వచ్చిన సదరు అధికారిపై సమగ్ర విచారణ చేపట్టి, ఆరోపణలు నిజమని తేలితే కఠిన చర్యలు తీసుకోవాలని సామాజిక కార్యకర్త రాధాకృష్ణ డిమాండ్ చేశారు. ప్రతి గ్రామపంచాయతీకి వెళ్లినప్పుడల్లా రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు అక్రమంగా వసూలు చేస్తున్నారని, దీంతో గ్రామపంచాయతీ అధికారులు భయాందోళనలకు గురవుతున్నారని రాధాకృష్ణ ఆరోపించారు. ఫోన్ పే, రసీదులు, స్వచ్ఛంద సంస్థల పేరుతో డబ్బుల వసూళ్లకు సంబంధించిన అంశాలపై కూడా సమగ్రంగా దర్యాప్తు చేయాలని కోరారు. ఆరోపణలపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించడంతో పాటు ఏసీబీ అధికారులతో విచారణ చేపట్టి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం వెంటనే స్పందించి చర్యలు తీసుకోకపోతే భూపాలపల్లి జిల్లా కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపడతామని రాధాకృష్ణ హెచ్చరించారు.

## కుప్పంలో సీఎం చంద్రబాబు సుడిగాలి పర్యటన..

# వందల కోట్ల పనులకు శ్రీకారం



**కుప్పం:** తన సొంత నియోజకవర్గమైన కుప్పంలో పర్యటించిన సీఎం చంద్రబాబు నాయుడు, నియోజకవర్గాన్ని 'స్వర్ణ కుప్పం'గా తీర్చి దిద్దే దిశగా వందల కోట్ల రూపాయల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఒకే రోజు పలు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవా లతో ఆయన పర్యటన బిజీబిజీగా సాగింది. పర్యటనలో భాగంగా రూ.10 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఆర్డీఓ, ఏఎస్పీ కార్యాలయాల భవనాలకు ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం కుప్పం మున్సిపాలిటీలో రూ.38 కోట్ల విలువైన వివిధ ప్రభుత్వ పనులకు భూమిపూజ నిర్వహించారు. రూ.3.30 కోట్లతో పూర్తిచేసిన సమీకృత ఘన వ్యర్థాల నిర్వహణ ప్లాంట్‌ను, మెటీరియల్ రికవరీ కేంద్రాన్ని ప్రారంభించారు. మల్లనూరులో 10 ఎకరాల విస్తీర్ణంలో రూ.2.70 కోట్లతో చేపట్టనున్న జూనియర్ కళాశాల నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. దీంతోపాటు వ్యవసాయ ఫీడర్ల కోసం ఉద్దేశించిన 15 మెగావాట్ల పీఎం కుసుమ్ సోలార్ ప్రాజెక్టులను కూడా ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.ప్రకృతి సేద్యమే శ్రీరామరక్ష.. రైతులకు సీఎం పిలుపుఅనంతరం 'స్వర్ణ కుప్పం' పేరుతో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొన్న చంద్రబాబు, పలువురు లబ్ధిదారులతో నేరుగా సంభాషించారు. హంద్రీనీవా కాలువ ద్వారా లబ్ధి పొందిన రైతుతో మాట్లాడుతూ.. వ్యవసాయంలో రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించాలని హితవు పలికారు. "వాతావరణ సమతుల్యం దెబ్బతినడం వల్లే ఎల్ నినో వంటి పరిస్థితులు ఏర్పడి వర్షాభావం నెలకొంది. దీనివల్ల కృష్ణా, గోదావరి నదులకు నీరు రాక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సేంద్రీయ ఎరువులు, బయోచార్ వంటి విధానాలతో భూసారాన్ని పెంచి, పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం. ప్రకృతి సేద్యం శ్రీరామరక్ష అనే విధానాన్ని పాటిద్దాం" అని రైతులకు పిలుపునిచ్చారు.

## ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ఎంపికపై

# వివాదం

- అర్హతలు, సేవా ప్రమాణాలు పక్కనపెట్టి సంఘాల సిఫారసులకే ప్రాధాన్యమా?




**పెద్దపల్లి జోర్దార్ నిఘా విభాగం** పెద్దపల్లి జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ఎంపికపై వివాదం నెలకొంది. అంతర్గాం మండలంలోని ఓ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడికి రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు ఇవ్వడంపై పలువురు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా విద్యార్థుల సంఖ్య పెంపు, బోధనలో అత్యుత్తమ ప్రతిభ, పాఠశాల అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు, విద్యార్థులను వివిధ పోటీ పరీక్షలకు సిద్ధం చేసి విజయాలు సాధించేలా చేసిన సేవలను పరిగణనలోకి తీసుకుని ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందజేస్తారని చెబుతున్నారు. అయితే సంబంధిత ఉపాధ్యాయుడి ఎంపికలో ఈ అంశాలను ఏ మేరకు పరిశీలించారన్నది ప్రశ్నార్థకంగా మారిందని ఆరోపణలు వినిపిస్తున్నాయి.సదరు ఉపాధ్యాయుడు గతంలో పాఠశాలకు కొత్తగా వచ్చిన సమయంలో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి ఫిర్యాదులు వచ్చినట్లు స్థానికంగా చర్చ జరుగుతోంది. అలాంటి నేపథ్యంలో ఆయనను రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎలా ఎంపిక చేశారనే దానిపై సమగ్ర విచారణ జరపాలని పలువురు కోరుతున్నారు. అదే మండలంలోని మరో పాఠశాలలో పనిచేస్తున్న సీనియర్ ఉపాధ్యాయుడికి జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు ఇవ్వడంపైనా అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. సీనియారిటీ ఒక్కటే ప్రామాణికంగా తీసుకుని అవార్డు ఇచ్చారా? పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల ఫలితాలు, బోధనలో ప్రత్యేక ప్రతిభ వంటి అంశాలను పరిశీలించారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.ఇక ఇద్దరు ఉపాధ్యాయులు గణిత బోధకులే కావడం మరో చర్చకు దారితీస్తోంది. అదే మండలంలో గణిత బోధనలో నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులతో పాటు విద్యార్థుల ఫలితాలు, పాఠశాల అభివృద్ధి, సామాజిక సేవ వంటి అనేక రంగాల్లో విశేషంగా పనిచేస్తున్న ఉపాధ్యాయులు ఉన్నప్పటికీ వారికి అవకాశం దక్కలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొంతమంది ఉపాధ్యాయులు సంఘ నాయకులుగా తమ పరిచయాలను ఉపయోగించుకుని సంఘాల సిఫారసులతో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందుతున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. అవార్డుల ఎంపికలో రాజకీయాలు, సంఘాల సిఫారసులకు తావులేకుండా స్పష్టమైన ప్రమాణాలు, పారదర్శకమైన పరిశీలన, మెరిట్ ఆధారంగా ఎంపిక జరగాలని ఉపాధ్యాయ వర్గాల్లో డిమాండ్ వినిపిస్తోంది. అవార్డుల ఎంపిక ప్రక్రియపై జిల్లా విద్యాశాఖ అధికారులు సమగ్రంగా పరిశీలించి, అర్హతలు, సేవా వివరాలు, విద్యార్థుల ఫలితాలు, పాఠశాల అభివృద్ధిలో చేసిన కృషిని బహిర్గతం చేయాలని పలువురు కోరుతున్నారు.

## దానం నాగేందర్ అనర్హత పిటిషన్‌పై బుధవారం

# సుప్రీంలో విచారణ





**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 21:** ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హత పిటిషన్‌ను విచారించేందుకు సుప్రీంకోర్టు అనుమతించింది. పార్టీ ఫిరాయింపుల కేసులో తెలంగాణ హైకోర్టు తనపై విధించిన అనర్హత వేటును సవాల్ చేస్తూ దానం నాగేందర్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై దానం తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి సుప్రీంకోర్టులో మెన్షన్ చేశారు. ఈ పిటిషన్‌ను సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి ధర్మాసనం బుధవారం(సెప్టెంబర్ 23) విచారణ జరపనుంది. తెలంగాణ హైకోర్టు తీర్పుపై స్టే ఇవ్వాలని కోరుతూ దానం నాగేందర్ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. ఇటీవల దానం నాగేందర్‌ను ఎమ్మెల్యే పదవికి అనర్హుడిగా తెలంగాణ హైకోర్టు ప్రకటించిన విషయం తెలిసిందే. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున ఖైరతాబాద్ నుంచి గెలిచిన దానం నాగేందర్.. 2024 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా సికింద్రాబాద్ నుంచి పోటీ చేశారు. ఈ నేపథ్యంలో దానంపై అనర్హత వేటు వేయాలంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి తెలంగాణ హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ అంశాన్ని పరిగణలోకి తీసుకున్న హైకోర్టు.. దానంపై అనర్హత వేటు వేస్తూ తీర్పు ఇచ్చింది.

RNI NO.TGTEL/25/A5224
జోర్దార్ JORDAR TELUGU DAILY తెలుగు దినపత్రిక
అవినీతి అంతం - మా పంతం

# రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



**జోగులాంబ గద్వాల్ జోర్దార్ ప్రతినిధి:** రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన ఘటన అలంపూర్ చౌరస్తా సమీపంలో చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. ఉండవెల్లి మండలం తక్కశిల గ్రామానికి చెందిన విశ్వంరాజు (23) ఆదివారం రాత్రి బైక్‌పై కర్నూలు వైపు వెళ్తుండగా, రాత్రి 7:30 నుంచి 8 గంటల మధ్య అలంపూర్ చౌరస్తా వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది.
ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన విశ్వంరాజును కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు.
అయితే చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారు జామున 6 గంటల సమయంలో మృతి చెందాడు.
ఘటనపై పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

# కొండా లక్ష్మణ్ బాపూజీకి ఘన నివాళి



**ఆదిలాబాద్, జోర్దార్ ప్రతినిధి:** ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 14వ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమాల్లో బాపూజీ పోషించిన కీలక పాత్రను నాయకులు కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం కేంద్ర మంత్రి పదవిని సైతం త్యాగం చేసి ఉద్యమానికి అండగా నిలిచారని గుర్తుచేశారు. బాపూజీ ఆశయాల సాధనకు ప్రభుత్వం కృషి చేయాలని, ఆదిలాబాద్ జిల్లాలో నిర్మించనున్న కొత్త విమానాశ్రయానికి ఆయన పేరు పెట్టాలని నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో మంచిగట్ల ఆశమ్మ, మమీడాల దశరథ్ ,జక్కుల సత్యనారా యణ, బేత రమేష్, కుర్ర రవీందర్, అనుముల ఊశన్న, కోక్కుల ఆదేళ్ల తదితరులు పాల్గొన్నారు.

# హాసన్‌పర్తి పీఏసీఎస్ చైర్మన్‌గా

## పింగిళి వెంకట్రామ్ నరసింహారెడ్డి బాధ్యతల స్వీకారం



**హసన్‌పర్తి, జోర్దార్ ప్రతినిధి:** హాసన్‌పర్తి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) చైర్మన్‌గా పింగిళి వెంకట్రామ్ నరసింహారెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. నూతన పాలకవర్గంతో కలిసి ప్రమాణ స్వీకారం నిర్వహించారు. ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఇనుగాల వెంకట్ రామ్ రెడ్డి హాజరయ్యారు.
ఈ సందర్భంగా పిఏసిఎస్ చైర్మన్ పింగళి వెంకట్రాం నరసింహ రెడ్డి మాట్లాడుతూ పీఏసీఎస్ ద్వారా రైతులకు సేవలు మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా అందించేందుకు కృషి చేస్తానన్నారు. రైతుల సంక్షేమం, సొసైటీ అభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేస్తానని తెలిపారు.

రైతులకు విత్తనాల నుంచి పంట విక్రయం వరకు సహకార సం ఘాల ద్వారా అవసరమైన సేవలు అందేలా కృషి చేస్తానన్నారు.
ఈ కార్యక్రమాంలో ఎనుమా ముల వ్యవసాయ మార్కెట్ చైర్మన్ పులి ప్రియా ంక, హసన్ పర్తి మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రేణిగుంట్ల అశోక్ కుమార్, హసన్ పర్తి మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు రాకేష్ రెడ్డి, 66 డివిజన్ అధ్యక్షుడు గొర్రె కిరణ్ కుమార్, 65 డివిజన్ అధ్యక్షుడు సునీల్ ,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నడక ఆరోగ్యాన్నికి ఆయువు పట్టు

ఎవరిశరీరాన్నికి
వారే వ్యాఖ్యాతలు
సుఖ దుఃఖానుభూతుల
మేలవింపు ఈశరీరం..
వివిధావేశాలకు..
ఆరోగ్యాన్ని పాడుచేసుకోవద్దు!..
వెనుక నుంచి దూసుకొచ్చే
దరాలోచనలు వద్దు!..
మీ అరోగ్య పిలుపులకు
మీకుమీరే ప్రతి స్పందించండి!..
ఆపైన ఆలోచించండి!..

నిర్లక్ష్యం చేస్తే.. ఆస్పత్రికి లేక
స్మశానానికి పోవలసి వస్తుంది
గమ్యం ఎక్కడికైనా...
గమనం మీ చేతుల్లోనే ఉంది!..
మీ అరోగ్యం మీ చేతుల్లోనే ఉంది!..
అందుకే మీ నడకతోనే సాధ్యం!..
ప్రతి అవయావాలను స్పర్శిస్తూ
మృదువుగా కదిలిస్తూ ఆరోగ్యాన్ని స్తుంది!..
ఆరోగ్యాన్నికి వెన్నుపోటు పొడిచే
అనారోగ్య శక్తులను
వెంటాడి వేటాడి తరిమేస్తుంది!...
ఇది నిజం తెలుసుకోండి...

మీ అరోగ్యాన్నికి సూత్ర ధారి
మీ ఆలోచన మీ మనసుకు పాత్రధారి
మీ అరోగ్య మొదళ్ళచుట్టూ మొలచిన
అనారోగ్య కల్పు మొక్కల్ని తొలిగించే..
నిజమైనా ఓ వైద్యాధికారి!..
మీ పురోగమనాన్నికి మీ శరీరాకృతి!..
రేపటి రూపాన్నికి నేటి నడక అవసరం..
అంతర్భాగంలో స్థబ్దతను నిశబ్దతను
మానసిక రుగ్మతులను తొలిగిస్తుంది!...

నిత్యం ఓ చైతన్యానికి ప్రతీక నడక..
ఉజ్వల భవిష్యత్తుకు ఊపిరి నడక..
చెడుమీద సమరం సాగించే
సమగ్రత్త మైన శక్తినిస్తుంది!..
ఆ రోగ్య ఉద్యమాన్నికి ఊతమై నిలుస్తుంది!..
నడక ఆరోగ్యాన్నికి ఆయువు పట్టు..
నడక నిత్యం శరీర అలసటను తీర్చే మందు !..
అనుకున్న గమ్యాన్నిచేర్చే మార్గదర్శి!..

ఇప్పుడు నడకతోనే ఆయువును..
పెంచుకుంటున్న మానవలోకం!..
డబ్బులతో సమాకుర్చలేని...
ఆరోగ్యాన్ని ఇస్తుంది నడక!..
మానసిక సౌధాన్నికి పునాది నడకనే...
కలిగే ఆనంద హృదయానుభూతుల...
ఓ చైతన్య భావ స్పర్శ నడక!!..

**అంబటి నారాయణ**
**నిర్మల్**
**7386699113**

# కాంగ్రెస్‌కు బిగ్ షాక్

## బీఆర్ఎస్‌లో చేరిన నాయకులు



**మొయినాబాద్ :** మొయినాబాద్ మండల పరిధిలోని తోల్కట్ట గ్రామంలో కాంగ్రెస్ పార్టీ కి బిగ్ షాక్ తగిలింది. ఆ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కనక మామిడి శ్రీనివాస్ ముదిరాజ్ తో పాటు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొలిగిద్ద సత్యనారాయణ సోదరుడు బొలిగిద్ద జగదీష్ బీఆర్ఎస్‌లో చేరారు.
బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు దారెడ్డి వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి సమక్షంలో వారు బీఆర్ఎస్ లో చేరారు. వారితో పాటు ముగ్గురు వార్డు సభ్యులు కాంగ్రెస్ కార్యకర్తలు చేరిలో వారిలో ఉన్నారు.
ఈ సందర్భంగా మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ అధికార కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు బీఆర్ఎస్ వైపు చూస్తున్నారని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను, అమలు చేయకపోవడంతో ప్రభుత్వ విధానాన్ని వ్యతిరేకిస్తూ బీఆర్ఎస్‌లో చేరుతున్నారని వెల్లడించారు. ప్రజా పాలనలో ప్రజా సంక్షేమానికి తావు లేక రాష్ట్రంలో మరోసారి బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు మొర శ్రీనివాస్, సీనియర్ నాయకులు రవి యాదవ్, సుధాకర్ యాదవ్, అంజయ్య గౌడ్, ఎండీ బిలాల్, సునీల్ కుమార్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు

# బాపూజీ ఆశయాల సాధనకు కృషి చేయాలి



**హుజురాబాద్ జోర్దార్ ప్రతినిధి:** తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ 14వ వర్ధంతి వేడుకలను సోమవారం హుజురాబాద్ పట్టణంలోని ఆర్టీసీ డిపో క్రాస్‌రోడ్ వద్ద ఉన్న బాపూజీ విగ్రహం వద్ద పద్మశాలి సమాజం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, బాపూజీ సేవలను స్మరించుకున్నారు. పద్మశాలి సంఘం నాయకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం బాపూజీ చేసిన త్యాగాలు, పోరాట స్ఫూర్తి చిరస్మరణీయమన్నారు. తన మంత్రి పదవితో పాటు సొంత ఇంటిని సైతం త్యాగం చేసిన మహనీయుడని కొనియాడారు. బాపూజీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సమాజ నాయకులు వేముల యాదగిరి, ఎలిగేటి ఉపేందర్, సంగెం ఐలయ్య, చందుపట్ల జనార్ధన్, సబ్బని రాజేందర్, విడపు రాజు, మంచికట్ల వెంకటరాజం, చిలుకమారి శ్రీనివాస్, మార్తా రవీందర్, మచ్చికట్ల కమలాకర్, మండల యాదగిరి, కుడికాల సాయి, ఇప్పలపల్లి చంద్రశేఖర్, ఆడెపు సూర్యం, సంగెం సత్యనారాయణ, సంగెం భాస్కర్, సంగెం శ్రీధర్, గాలి సమ్మయ్య, మంద బిక్షపతి, కొండా గణేష్, సంగెం శ్రీనివాస్ (చిక్స్), సంగెం శ్రీనివాస్ (మెడికల్), నల్గొండ కుమార్, వేముల రమ తదితరులు పాల్గొన్నారు.

# వినాయక మండపాలను సందర్శించిన

## శంకర్ దీక్ దాస్ మహారాజ్



**హుజూరాబాద్ జోర్దార్ ప్రతినిధి:** హుజూరాబాద్ పట్టణం, పరిసర ప్రాంతాల్లోని పలు వినాయక మండపాలను పూజ్యశ్రీ శ్రీ శ్రీ శంకర్ దీక్ దాస్ సర్కార్ మహారాజ్ హిందూ ఉత్సవ సమితి ప్రతినిధులతో కలిసి సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా మండపాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి నిర్వాహకులకు ఆశీస్సులు అందించారు.
అనంతరం మహారాజ్ మాట్లాడుతూ 'గో సమ్మాన్ అభియాన్' ద్వారా భారతీయ సంస్కృతి, గోరక్షణ, సనాతన ధర్మం ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేయాలని పిలుపునిచ్చారు. పండుగలను ఆధ్యాత్మిక వాతావరణంలో ఐక్యతతో జరుపుకోవాలని కోరారు. అలాగే గోవును జాతీయ జంతువుగా గుర్తించాలని ప్రభుత్వాన్ని కోరారు.
కార్యక్రమంలో హిందూ ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ విష్ణుదాసు గోపాల్‌రావు, కందుల శ్రీనివాస్‌రెడ్డి, మంచికట్ల మురళి, మ్యాకల రాజిరెడ్డి, దొనకొండ సత్యనారాయణరెడ్డి, వర్ధినేని రవీందర్‌రావు, వద్లూరి విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# వీఓఏల సమస్యలు పరిష్కరించాలని ధర్నా




**రంపచోడవరం, ఏపీ స్టేట్ జోర్దార్ ప్రతినిధి:** వెలుగు యానిమేటర్స్ (వీఓఏ) సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం రంపచోడవరం డీఆర్‌డీఏ పీడీ కార్యాలయం ఎదుట వీఓఏలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వెలుగు యానిమేటర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి అరగాటి రామకృష్ణరెడ్డి మాట్లాడుతూ పోలవరం జిల్లా పరిధిలో వీఓఏలపై పని ఒత్తిడి పెరిగిందని, సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు.
ధర్నా అనంతరం డీఆర్‌డీఏ పీడీ సానుకూలంగా స్పందించి, సమస్యలను సెర్ప్‌కు నివేదించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. సమస్యలు పరిష్కరించకపోతే జిల్లాలోని వీఓఏలంతా సమ్మెకు దిగుతామని రాతపూర్వకంగా తెలియజేశారు. కార్యక్రమంలో తొమ్మిది మండలాలకు చెందిన వీఓఏలు పాల్గొన్నారు.

# మండల పరిషత్ సమీక్ష సమావేశం




**హుజురాబాద్, జోర్దార్ ప్రతినిధి :** హుజురాబాద్ మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం మండల పరిషత్ సమీక్ష సమా వేశం నిర్వహించారు. మండలంలోని ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల అమలుపై సర్పంచులు, మండల స్థాయి అధికారులతో సమీక్షించారు. ఆర్డీఓ, మండల పరిషత్ ప్రత్యేక అధికారి జలకుమారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీడీవో తూర్పాటి సునీత, తహసీల్దార్ నరేందర్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కొండా లక్ష్మణ్ బాపూజీకి ఘన నివాళి



**హనుమకొండ, జోర్దార్ ప్రతినిధి:** హనుమకొండలో పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు బచ్చు ఆనందం ఆధ్వర్యంలో నిర్వహించిన కొండా లక్ష్మణ్ బాపూజీ 14వ వర్ధంతి కార్యక్రమంలో కమలాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తౌటం ఝాన్సీ రాణి రవీందర్ పాల్గొన్నారు. అంబేద్కర్ కూడలి, హంటర్ రోడ్డులోని వీవర్స్ హాస్టల్‌లో బాపూజీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.
స్వాతంత్ర్య ఉద్యమం తో పాటు తొలి, మలిదశ తెలంగాణ ఉద్యమాల్లో బాపూజీ కీలక పాత్ర పోషించారని ఆమె కొనియాడారు. తెలంగాణ ఉద్యమానికి తన జలదృశ్యం ఇంటిని కేటాయించి ఉద్యమకారులకు ఆశ్రయం కల్పించిన మహనీయుడికి భారతరత్న పురస్కారం ఇవ్వాలని ప్రభుత్వాలను కోరారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

RNI NO.TGTEL/25/A5224
జోర్దార్
JORDAR TELUGU DAILY తెలుగు దినపత్రిక
అవినీతి అంతం - మా పంతం

మంగళవారం,
సెప్టెంబర్ 22 2026



# న్యాయం చేయండి మహా ప్రభో

● లోక్ ఆయుక్త కు "మాచన" ప్రార్థన



విధి నిర్వహణ లో ఉండగా ఓ ఉద్యోగి పట్ల అనుచితంగా మాట్లాడిన ఉదంతం లో..ఆ అధికారి పై తగు చర్య తీసుకోవాలని తమకు న్యాయం చేయాలని కోరుతూ..ఆ ఉద్యోగి తల్లి లోక్ ఆయుక్త ధర్మాసనాన్ని వేడుకున్నారు.
వివరాల్లోకి వెళ్తే..మాచన విజయ తనయుడు రఘునందన్ పౌర సరఫరాల శాఖ ఎన్ఫోర్స్మెంట్ డిప్యూటీ తాశిల్దార్ గా రంగారెడ్డి జిల్లా కు పని చేశారు.కొంగరకలాన్ రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ లో పౌర సరఫరాల శాఖ కార్యాలయం లో గతేడాది సెప్టెంబర్ 30 న ఓ అవాంఛనీయ సంఘటన చోటు చేసుకుంది.విధి నిర్వహణలో ఉన్న ఉద్యోగి మాచన రఘునందన్ ను అతని పై అధికారి నోటికి ఇష్టం వచ్చినట్టు మాట్లాడాడు.ఈ ఉదంతం జరగగానే తనను తన పై అధికారి "అన్ పార్లమెంటరీ"పదజాలం తో దూషించాడని రఘునందన్ అటు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కు,పౌర సరఫరాల శాఖ కమీషనర్ కు సైతం లిఖిత పూర్వక ఫిర్యాదు చేశారు.ఇదే క్రమం లో.. మాచన విజయ తన కొడుకును అసభ్యకరంగా,అనుచితంగా దూషించిన సదరు ఏ సి ఎస్ వో పై తగు చర్య తీసుకోవాలని కోరుతూ..లోక్ ఆయుక్త కు గతేడాది నవంబర్ లో ఫిర్యాదు చేశారు.కాగా..ఈ పిర్యాదు ను లోక్ ఆయుక్త సీరియస్‌గానే పరిగణించి కేసు నమోదు చేసినప్పటికీ రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయ యంత్రాంగం ను,సిబ్బంది ని తన పర పతి తో.. తనకు అనుకూలంగా మలచుకుని నివేదికను తనకు అనుకూలంగా లోక్ ఆయుక్త కు సమర్పించారన్న సమాచారం తనకు ఉందని విజయ అనుమానిస్తూ.. ఓ మహిళ ను.. అందునా ఓ ఉద్యోగి తల్లి ని ఉద్దేశించి , ఓ ప్రభుత్వ కార్యాలయం లో ఓ అధికారి అనుచితంగా మాట్లాడటం సభ్య సమాజానికే సిగ్గుచేటు.. కావునా ఆ అవాంఛనీయ ఘటన పై మరో మారు పూర్తి స్థాయి పునఃవిచారణ జరిపించగలరని అపుడు ఉన్న ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలం కూడా తీసుకుని తమ కుటుంబానికి న్యాయం చేయాలని విజయ లోక్ ఆయుక్త ను మరో మారు వేడుకున్నారు.

## భూపాలపల్లి జిల్లాలో ఎంపీడీవోపై ఆరోపణలు

# చర్యలు తీసుకోవాలి

● అవినీతి, అక్రమ వసూళ్లపై సిట్టింగ్ విచారణ జరిపించాలి
● ఏసీబీతో విచారణ జరిపించి సస్పెండ్ చేయాలని సామాజిక కార్యకర్త రాధాకృష్ణ డిమాండ్

**భూపాలపల్లి, జోర్దార్ ప్రతినిధి:** భూపాలపల్లి జిల్లా లో గత 12 నెలలుగా విధులు నిర్వహిస్తున్న ఓ మండల పరిషత్ అభివృద్ధి అధికారిపై అవినీతి, అక్రమ వసూళ్లకు సంబంధించిన ఆరోపణలు ఉన్నాయని సామాజిక కార్యకర్త రాధాకృష్ణ ఆరోపించారు. నిజామాబాద్ జిల్లా నుంచి బదిలీపై వచ్చిన సదరు అధికారిపై సమగ్ర విచారణ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.
ప్రతి గ్రామపంచాయతీని సందర్శించిన సందర్భంలో రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు అక్రమంగా వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయని, దీంతో గ్రామపంచాయతీ అధికారులు భయభ్రాంతులకు గురవుతున్నారని రాధాకృష్ణ పేర్కొన్నారు. ఫోన్ పేరుతో వసూళ్లు, రశీదులు, స్వచ్ఛంద సంస్థల పేరుతో డబ్బుల సేకరణ తదితర అంశాలపై కూడా ఆరోపణలు ఉన్నాయని తెలిపారు.
ఈ వ్యవహారంపై సిట్టింగ్ అధికారులతో సమగ్ర విచారణ జరిపించాలని, అవసరమైతే అవినీతి నిరోధక శాఖతో దర్యాప్తు చేయించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆరోపణలు నిజమని తేలితే సదరు అధికారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.
ప్రభుత్వం వెంటనే స్పందించి చర్యలు తీసుకోకపోతే భూపాలపల్లి జిల్లా కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపడతామని రాధాకృష్ణ హెచ్చరించారు.

# రంపచోడవరం ఐటీడీఏ డీడీ, అడ్డతీగల ఏటీడబ్ల్యూవో సస్పెన్షన్‌కు డిమాండ్

**అమరావతి/అడ్డతీగల,జోర్దార్ బ్యూరో:** అడ్డతీగల ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలలో మైనర్ బాలికల గర్భధారణ ఘటనలపై పూర్తిస్థాయి విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజ శ్రీను డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం అమరావతి సచివాలయంలోని గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు.
ఈ సందర్భంగా కుంజ శ్రీను మాట్లాడుతూ.. ఘటనలకు కేవలం కిందిస్థాయి సిబ్బందిని బాధ్యులను చేసి సస్పెండ్ చేయడం కంటితుడుపు చర్యేనని ఆరోపించారు. పాఠశాలల పర్యవేక్షణలో నిర్లక్ష్యం వహించిన రంపచోడవరం ఐటీడీఏ డిప్యూటీ డైరెక్టర్ ఎం. రుక్మాంగదయ్య, అడ్డతీగల ఏటీడబ్ల్యూవో కృష్ణమోహన్‌లను వెంటనే సస్పెండ్ చేసి, వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు. పాఠశాలలను క్రమం తప్పకుండా తనిఖీ చేయాల్సిన అధికారులు తమ బాధ్యతలను విస్మరించారని ఆయన ఆరోపించారు.బాధితుల కుటుంబాలపై నిందలు వేయకుండా ఘటనలకు దారితీసిన కారణాలను సమగ్రంగా వెలికితీయాలని కోరారు.
విధుల్లో నిర్లక్ష్యంపై (అట్రాసిటీ) నిరోధక చట్టం సెక్షన్ 4, పోక్సో చట్టం సెక్షన్ 21 కింద చర్యలు తీసుకోవాలని అధికారులను డిమాండ్ చేశారు.కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు కోటం రాజన్నదొర, బల్లెం గంగాభవాని,శారదాదేవి తదితరులు పాల్గొన్నారు.

# నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించిన పాలకవర్గం, అధికారులు



**హుజురాబాద్ జోర్దార్ ప్రతినిధి:** గణేష్ నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా నిర్వహించ నున్న గణనాథుల నిమజ్జనానికి హుజురాబాద్ మున్సిపల్ పాలకవర్గం, అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.
సోమవారం మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని ఆధ్వర్యంలో నిమజ్జన ప్రాంతాన్ని పరిశీలించారు.ఈ ఏడాది వర్షపాతం తక్కువగా ఉండటంతో ఎస్ఆర్ఎస్పీ కెనాల్‌లో నీటి లభ్యత లేకపోవడంతో అధికారులు ఇరిగేషన్ శాఖ అధికారులతో చర్చించారు.
కెనాల్‌లో నీటిని విడుదల చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు. నీరు నిమజ్జన ప్రాంతానికి చేరకపోతే ప్రత్యామ్నాయంగా ఇసుక బస్తాలతో నీటిని నిల్వ చేసి నిమజ్జనానికి ఏర్పాట్లు చేయా లని నిర్ణయించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు.
కార్యక్రమంలో ఆర్డీ ఓ జలకుమారి, ఏసీపీ మాధవి, తహసీల్దార్ నరేందర్, సీఐ కరుణాకర్, మున్సిపల్ కమిషనర్ కిషన్, ఇరిగేషన్ అధికారులు, వినాయక నిమజ్జన ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షుడు ఈదు లకంటి రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ విష్ణుదాస్ గోపాలరావు, సలహాదారులు నల్లగొని రాకేష్, మంచికట్ల మురళి తదితరులు పాల్గొన్నారు.

# ఎస్‌జీఎఫ్ క్రీడల్లో

## మహదేవపూర్ విద్యార్థుల సత్తా



**మహదేవపూర్,జోర్దార్ ప్రతినిధి:** మహదేవపూర్ మండల కేంద్రంలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ మండల స్థాయి క్రీడా పోటీల్లో జడ్పీ ఉన్నత పాఠశాల బాలుర విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. అండర్–14 వాలీబాల్, అండర్–17 ఖోఖో, అండర్–14 ఖోఖో విభాగాల్లో ప్రథమ స్థానాలు సాధించారు.విజేతలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనిల్‌కుమార్ అభినందించారు. విద్యార్థుల కృషి, క్రమశిక్షణతో పాటు పీడీ రమేష్ శిక్షణ విజయానికి దోహదపడిందన్నారు. జిల్లా స్థాయి పోటీల్లోనూ రాణించి రాష్ట్ర స్థాయికి ఎంపిక కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, రాజయ్య, లచ్చయ్య, సమ్మయ్య, అనిత,కవిత తదితరులు పాల్గొన్నారు.

# పెద్దతండ్రపాడు పాఠశాలలో

## వైద్య శిబిరం



**జోగులాంబ గద్వాల్ జోర్దార్ ప్రతినిధి:** పెద్దతండ్రపాడు జెడ్పీహెచ్ఎస్, ప్రాథమిక పాఠశాలలో సోమవారం ఆర్‌బీఎస్‌కే బృందం, సబ్‌సెంటర్ వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సాధారణ ఆరోగ్య పరీక్షలతో పాటు రక్తహీనత (అనీమియా), కంటి పరీక్షలు తదితర వైద్య పరీక్షలు నిర్వహించారు.విద్యార్థుల్లో జ్వరం, జలుబు, దగ్గు, మైగ్రేన్, సాధారణ నీరసం తదితర సమస్యలను పరిశీలించారు. అలాగే సీజనల్ వ్యాధుల లక్షణాలపై కూడా పరీక్షలు నిర్వహించారు.
పరీక్షల్లో ఆరోగ్య సమస్యలు ఉన్నట్లు గుర్తించిన విద్యార్థులను మెరుగైన వైద్యం కోసం సంబంధిత ఆసుపత్రులకు రెఫర్ చేసినట్లు వైద్య సిబ్బంది తెలిపారు.

# బాలికలకు స్టడీ మెటీరియల్ పంపిణీ



**బెల్లంపల్లి,జోర్దార్ ప్రతినిధి:** ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా తాండూర్ మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు చిలుముల శ్రీకృష్ణదేవరాయలు హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. బాలికల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేక అధికారి కవిత, బీజేపీ మండల అధ్యక్షుడు దూడపాక భరత్ కుమార్, జిల్లా కార్యదర్శి రామగౌని మహిధర్ గౌడ్, సీనియర్ నాయకులు పులగం తిరుపతి, సిద్ధం మల్లేష్, పుట్ట కుమార్, గాదె రాజేశం, ఆవుల చందు, కామెర మహేష్, ఉపాధ్యాయులు సుమన, చైతన్య, విద్యార్థులు పాల్గొన్నారు.

# పిడుగుపాటుకు బాలుడు మృతి



**జోగులాంబ గద్వాల్ జోర్దార్ ప్రతినిధి:కేటీ దొడ్డి:** పొలం నుంచి ఇంటికి తిరిగి వస్తున్న 16 ఏళ్ల బాలుడు పిడుగుపాటుకు మృతి చెందిన విషాద ఘటన కేటీ దొడ్డి మండలం యర్సన్‌దొడ్డి గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కుర్వ వెంకటేష్ కుమారుడు మల్లేష్ (16) పొలం నుంచి ఇంటికి వస్తుండగా వర్షం ప్రారంభమైంది. దీంతో కృష్ణస్వామి దేవాలయం సమీపంలోని ఓ చెట్టు కిందకు వెళ్లి నిల్చున్నాడు. అదే సమయంలో చెట్టుపై పిడుగు పడటంతో మల్లేష్ అక్కడికక్కడే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు.ఈ విషాద ఘటనతో యర్సన్‌దొడ్డి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

# తోట చంద్రయ్యను పరామర్శించిన మంత్రి



**రామగిరి జోర్దార్ ప్రతినిధి:** కరీంనగర్‌లోని అపోలో రీచ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు, ఉమ్మడి కమాన్‌పూర్ మండల మాజీ ఎంపీపీ, మాజీ సర్పంచ్, మాజీ రామగిరి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోట చంద్రయ్యను మంత్రి పరామర్శించారు.ఈ సందర్భంగా తోట చంద్రయ్యతో మంత్రి మాట్లాడి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం అందుతున్న వైద్య చికిత్స, ఆరోగ్య పరిస్థితిపై వివరాలు తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి వైద్యులతో కూడా చంద్రయ్యకు అందుతున్న వైద్య సేవల గురించి మంత్రి తెలుసుకున్నారు.

# ఆంజనేయస్వామి సన్నిధిలో ఘనంగా

## మహా అన్నదాన కార్యక్రమం



**టేకుమట్ల జోర్దార్ ప్రతినిధి:** టేకుమట్ల మండలం సుబ్బక్కపల్లి గ్రామంలో ఆంజనేయ స్వామి దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం భక్తి శ్రద్ధలతో మహా అన్నదానకార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.
ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారికి నైవేద్యం సమర్పించారు.అనంతరం భక్తులు గ్రామస్తులకు మహా అన్నదానం చేపట్టారు.ఈ కార్యక్రమానికి భక్తులు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకొని అన్నప్రాసదాన్ని స్వీకరించారు.ఆంజనేయస్వామి ఆశీస్సులతో గ్రామ ప్రజలు అందరు సుఖ సంతోషాలతో
ఆయురారోగ్యాలతో ఉండాలని ఆలయ కమిటీ సభ్యులు ఆకాంక్షించారు.మహా అన్నదానకార్యక్రమానికి సహకరించిన దాతలు భక్తులు గ్రామస్తులకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

# లారీని వెనుక నుంచి ఢీకొట్టిన కంటైనర్

## డ్రైవర్ మృతి




**జోగులాంబ గద్వాల్ జోర్దార్ ప్రతినిది:** జోగులాంబ గద్వాల జిల్లా నారాయణపురం స్టేజీ సమీపంలో సోమవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది.బ్రేక్‌డౌన్ అయిన గోధుమల లారీని వెనుక నుంచి వేగంగా వచ్చిన కంటైనర్ ఢీకొట్టడంతో లారీ డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం.
లారీని పరిశీలించేందుకు డ్రైవర్ కిందకు దిగిన సమయంలో ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. మరో వ్యక్తికి తీవ్ర గాయాలు కాగా, కాలు విరగడంతో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు,ఎన్‌హెచ్ఏఐ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# భద్రకాళి కార్ వాష్ సెంటర్ ప్రారంభించిన మున్సిపల్ చైర్ పర్సన్



**హుజురాబాద్ జోర్దార్ ప్రతినిధి:** హుజురాబాద్ పట్టణంలోని జమ్మికుంట రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన భద్రకాళి కార్ వాష్ సెంటర్ ను హుజురాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ రెంటాల సుహాసిని మనోజ్ రావు ప్రారంభించారు.ఈ సందర్భంగా కారు వాష్ సెంటర్ యజమాని కొలిపాక సాయికి ఆమె ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపి వ్యాపారం దినదిన అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.
ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ గూడూరి అంజలి కౌన్సిలర్లు కాలిక్ హుస్సేన్, చందమల్ల పుణ్య, హనుమాన్ దేవస్థానం చైర్మన్ కొలిపాక శంకర్ తదితరులు పాల్గొన్నారు.

RNI NO.TGTEL/25/A5224
జోర్దార్
JORDAR TELUGU DAILY తెలుగు దినపత్రిక
అవినీతి అంతం - మా పంతం



# సర్పంచుల సమస్యలపై అధికారుల దృష్టికి

## మండల సమీక్షా సమావేశంలో పలు సమస్యల ప్రస్తావన



**జమ్మికుంట జోర్దార్ ప్రతినిధి:**మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు మండల స్పెషల్ ఆఫీసర్ లింగారెడ్డి అధ్యక్షతన మండల సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశానికి మండలంలోని 17 మంది సర్పంచులు, వివిధ శాఖల అధికారులు, ఎంపీడీఓ పద్మావతి, తహసీల్దార్ సుధాకర్ తదితరులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా మండలంలోని వివిధ శాఖల పనితీరు, అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఆయా శాఖలకు సంబంధించిన సమస్యలను సర్పంచులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా వైద్య శాఖలో మందుల కొరత, సిబ్బంది కొరతతో పాటు మండల పరిధిలోని ఆర్అండ్‌బీ రహదారుల మరమ్మతులు చేపట్టాల్సిన అవసరాన్ని అధికారులు, సర్పంచులు సమావేశంలో ప్రస్తావించారు.

సర్పంచులు వెల్లడించిన సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని స్పెషల్ ఆఫీసర్ లింగారెడ్డి హామీ ఇచ్చారు.

గ్రామాల అభివృద్ధిలో సర్పంచుల సహకారం అభినందనీయమని ఎంపీడీఓ పద్మావతి పేర్కొన్నారు. భవిష్యత్‌లో ప్రభుత్వం చేపట్టే అన్ని కార్యక్రమాల్లోనూ సర్పంచులు ఇదే విధంగా సహకరించాలని ఆకాంక్షించారు.

సమావేశం సంతృప్తికరంగా జరిగిందని పేర్కొన్న ఎంపీడీఓ పద్మావతి.. సమావేశానికి హాజరై సహకరించిన సర్పంచులు, అధికారులు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

# విద్యార్థులకు బలం అల్పాహారం



- ప్రభుత్వ విప్ విజయ రమణారావు
- జీలకుంటలో ప్రారంభించిన సర్పంచ్ రాగిడిమంగ

**ఓదెల జోర్దార్ విలేఖరి:**రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన విద్యార్థులకు అల్పాహారం పథకాన్ని ఓదెల మండల కేంద్రంలో నేడు ప్రభుత్వ విప్ విజయ రమణారావు స్థానిక మోడల్ స్కూల్లో ఘనంగా ప్రారంభించారు. విద్యార్థులే దేశ భవిష్యత్తు అని భావించి,వారి చదువు ఎట్టి పరిస్థితుల్లోనూ ఆగకూడదని ...ముఖ్యంగా ఆహార సమస్య వలన చదువుకోలేని పరిస్థితి ఉండకూడదని తెలంగాణ ప్రభుత్వం అల్పాహార పథకాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిందని ఆయన పేర్కొన్నారు.

అలాగే మండలంలోని జీలకుంట ప్రాథమిక పాఠశాలలో ముఖ్యమంత్రి ఉచిత అల్పాహార పథకాన్ని సర్పంచ్ శ్రీమతి రాగిడిమంగ పాఠశాలలోని చిన్నారులకు స్వయంగా వడ్డించి ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ.. అల్పాహారం పథకం ద్వారా ప్రతిరోజు ఉదయం విద్యార్థులకు పౌష్టికాహారంతో కూడిన అల్పాహారం ఉచితంగా అందించడం జరుగుతుందని, దీని వల్ల పిల్లల హాజరు, మరియు ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలిపారు. విద్యార్థులు ఆకలితో బడికి రాకూడదు అనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి ఈ పథకం ప్రారంభించారని రాగిడి మంగ పేర్కొన్నారు .ఖాళీ కడుపుతో పాఠశాలకు వచ్చే విద్యార్థులు పాఠాలపై ఏకాగ్రత చూపలేక పోతున్నారని, వారి అభ్యాస సామర్థ్యాన్ని పెంచడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని ఆమె చెప్పారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వానికి సర్పంచ్ రాగిడి మంగ ధన్యవాదాలు తెలిపారు .

ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, మధ్యాహ్న భోజన నిర్వాహకులు ,విద్యార్థులు మరియు స్థానికులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితాలో మీ పేరు ఉందా..?

## ఓసారి చెక్ చేసుకోండి!



- నోటీసులు వస్తే నిర్లక్ష్యం వద్దు.. ఆధారాలతో హియరింగ్‌కు రండి
- ఓటర్లకు రామగిరి తహసీల్దార్ పర్నంది సుమన్ సూచన

**రామగిరి, జోర్దార్ ప్రతినిధి:**ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా నోటీసులు అందుకున్న వారు నిర్లక్ష్యం చేయకుండా నిర్ణీత గడువులోగా స్పందించాలని రామగిరి తహసీల్దార్ పర్నంది సుమన్ సూచించారు. అవసరమైన ధ్రువపత్రాలతో హియరింగ్‌కు హాజరు కావాలని తెలిపారు.

లద్నాపూర్ గ్రామపంచాయతీలో సర్పంచ్ వనం రామచంద్రరావు అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభలో తహసీల్దార్ సుమన్ పాల్గొని ఓటర్లకు అవగాహన కల్పించారు.

ఓటరు జాబితాలో తప్పులు లేకుండా, అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కు కొనసాగించాలనే ఉద్దేశంతో నోటీసులు జారీ చేస్తున్నట్లు వివరించారు. పేరు, ఇంటిపేరు, వయస్సు తదితర వివరాల్లో తేడాలు ఉంటే సంబంధిత ఆధారాలను సమర్పించి సరిచేసుకోవాలని సూచించారు. 2002 నాటి ఓటరు జాబితాలో కుటుంబ సభ్యుల వివరాలను మ్యాపింగ్ చేసుకోవాలని తెలిపారు.

నోటీసులకు స్పందించకుండా, గడువులోగా అవసరమైన పత్రాలు సమర్పించక పోతే ఓటరు జాబితాలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని పేర్కొన్నారు.

నోటీసులు అందుకున్న ప్రతి ఓటరు తమకు కేటాయించిన హియరింగ్ తేదీన అవసరమైన ఆధారాలు, సర్టిఫికెట్లు, ఫారంతో హాజరు కావాలని సూచించారు.

గ్రామసభలో ఓటర్లు అడిగిన సందేహాలను అధికారులు నివృత్తి చేశారు.

కార్యక్రమంలో గ్రామ అధికారి ఏ.సతీష్, జీపీవో రాజేష్, ఉపసర్పంచ్ శ్రీకాంత్, వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# 55వ డివిజన్‌లో

## వినాయక నిమజ్జన ఏర్పాట్లు ఎక్కడ?

- వార్డు అధికారుల పర్యవేక్షణపై భక్తుల ప్రశ్నలు

**హసన్ పర్తి జోర్దార్ ప్రతినిధి:**వినాయక నవరాత్రి ఉత్సవాలు ముగింపు దశకు చేరుకోవడంతో 55వ డివిజన్‌లో నిమజ్జన ఏర్పాట్లపై భక్తుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. నిమజ్జనం ఎక్కడ నిర్వహిస్తున్నారు అక్కడ ఎలాంటి సౌకర్యాలు కల్పిస్తున్నారు, భక్తులకు ఎవరు మార్గనిర్దేశం చేస్తారనే విషయాలపై స్పష్టత లేదని స్థానికులు పేర్కొంటున్నారు.ముఖ్యంగా వార్డు ఆఫీసర్ ఎవరు, నిమజ్జన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న అధికారులు ఎవరనే వివరాలు తెలియక భక్తులు అయోమయానికి గురవుతున్నారని తెలిపారు. నిమజ్జన స్థలాన్ని ముందుగానే ప్రకటించి, లైటింగ్, నీటి వసతి, పారిశుద్ధ్యం, బారికేడింగ్, పోలీస్ బందోబస్తు, వైద్య సదుపాయాలు కల్పించాలని కోరుతున్నారు.

అధికారులు వెంటనే స్పందించి స్పష్టమైన సమాచారం ఇవ్వాలని 55వ డివిజన్ ప్రజలు, భక్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# భీమదేవరపల్లి మండలంలో

## ప్రపంచ శాంతి దినోత్సవం




**భీమదేవరపల్లి జోర్దార్ విలేఖరి:**జన విజ్ఞాన వేదిక భీమదేవరపల్లి మండల శాఖ ఆధ్వర్యంలో వంగర బాలికల గురుకుల పాఠశాలలో ప్రపంచ శాంతి దినోత్సవం సందర్భంగా కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి జన విజ్ఞాన వేదిక జిల్లా జనరల్ సెక్రటరీ డా. అజయ్ కుమార్ రౌతు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ..ప్రపంచ శాంతి కోసం ప్రతి ఒక్కరూ మానవతా దృక్పథంతో వ్యవహరించాలని, హింసకు బదులుగా సంభాషణ, సహకారం, సౌభ్రాతృత్వం ద్వారా సమస్యలను పరిష్కరించు కోవాలని పేర్కొన్నారు. ప్రపంచమంతా శాంతి సౌభ్రాతృత్వం విలసిల్లాలి ప్రపంచవ్యాప్తంగా శాంతి, సౌభ్రాతృత్వం, మానవతా విలువలు పరిఢవిల్లాలని అజయ్ కుమార్ రౌతు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక ప్రచురిస్తున్న చెకుముకి పత్రికను ఆవిష్కరించి విద్యార్థులకు బహుకరించారు. శాస్త్రీయ విజ్ఞానం ప్రజలు , విద్యార్థులకు కలుగ చేయుటకు చెకుముకి ప్రచురణ ద్వారా జరుగుతున్న కృషిని ఆయన వివరించారు.

ప్రిన్సిపాల్ అఫ్రీన్ సుల్తానా అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జన విజ్ఞాన వేదిక కార్యదర్శి రామంచ బిక్షపతి, వలిహుస్సేన్ తదితరులు పాల్గొని ప్రపంచ శాంతి, సామాజిక ఐక్యత, మత సామరస్యం మరియు మానవ విలువల ప్రాధాన్యతను వివరించారు.

ప్రపంచ శాంతి దినోత్సవం సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు శాంతి, సౌభ్రాతృ త్వం, మానవతా విలువలను పెంపొందించే ందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రపంచ శాంతి, సామాజిక ఐక్యత, మత సామర స్యం మరియు మానవ విలువల ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# హుజురాబాద్‌లో నిమజ్జనానికి

## కట్టుదిట్టమైన భద్రత



**హుజురాబాద్ జోర్దార్ ప్రతినిధి:**హుజురాబాద్‌లో బుధవారం జరగనున్న వినాయక నిమజ్జనానికి కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఏసీపీ మాధవి తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. నిమజ్జనం సందర్భంగా డీజేలు, బాణసంచాకు అనుమతి లేదని, నిబంధనలు ఉల్లంఘిస్తే ఎంతటి వారైనా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. నిమజ్జన ఉత్సవ కమిటీలు, మండపాల నిర్వాహకులు, ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.కార్యక్రమంలో ఆర్డీఓ జలకుమారి, మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని, తహసీల్దార్ నరే ందర్, కమిషనర్ కిషన్, టౌన్ సీఐ కరుణాకర్, కౌన్సిలర్లు, నిమజ్జన ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# సింగరేణి కార్మికుల

## సమస్యలు పరిష్కరించాలి



**బెల్లంపల్లి జోర్దార్ ప్రతినిధి :**సింగరేణి కార్మికుల అపరిష్కృత సమస్యలను వెంటనే పరిష్కరించాలని, సంస్థ లాభాల్లో కార్మికులకు 35 శాతం వాటా ప్రకటించాలని ఐఎన్‌టీయూసీ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ బి. జనప్రసాద్ ఆధ్వర్యంలో ప్రతినిధుల బృందం సోమవారం హైదరాబాద్‌లో సింగరేణి సీఎండీ, డైరెక్టర్లను కలిసి సమస్యలపై చర్చించింది.

కార్మికులకు ప్రతి నెలా మెడికల్ బోర్డు నిర్వహించడం, అర్హులైన అనారోగ్య కార్మికులను మెడికల్ అన్‌ఫిట్‌గా గుర్తించడం, సొంత ఇంటి పథకాన్ని త్వరగా అమలు చేయడం, పెర్క్స్‌పై ఆదాయపు పన్ను మినహాయింపు సమస్యను దసరాలోపు పరిష్కరించాలని కోరారు. అధికారులు సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చినట్లు ప్రతినిధులు తెలిపారు.

# గుప్త నిధుల తవ్వకాలు..

## పరారీలోని ముగ్గురిలో ఇద్దరి అరెస్ట్

**పెన్‌పహాడ్,:** నిజాం కాలం నాటి మసీదు వద్ద గుప్త నిధుల కోసం రాత్రివేళ తవ్వకాలు చేపట్టిన వారిలో 12 మందిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మరో వ్యక్తి పరారీలో ఉన్నాడు. ఈ ఘటన పెన్‌పహాడ్ మండలంలోని అనాజీపురం రెవెన్యూ పరిధి రాజాపేటలో చోటుచేసుకుంది. సూర్యాపేట సర్కిల్ కార్యాలయంలో పెన్‌పహాడ్ ఎస్ఐ బాలునాయక్‌తో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ రాజశేఖర్ కేసు వివరాలను వెల్లడించారు. సెప్టెంబర్ 16న రాత్రి రాజాపేటలోని పురాతన మసీదు భవనం, పరిసరాల్లో కొందరు వ్యక్తులు గుప్త నిధుల కోసం తవ్వకాలు చేస్తున్నట్లు గ్రామస్థులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని 13 మందిలో 10 మందిని అదుపులోకి తీసుకున్న విషయం విదితమే. కాగా పరారైన ముగ్గురిలో ఇద్దరిని అనంతరం పట్టుకున్నారు. కాసారబాదకు చెందిన కొమరాజు నరసింహ ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు తెలిపారు. దొంగరి మధన్, షేక్ సైదా, సయ్యద్ అమీర్ అలీ, షేక్ రహమాన్ రఫీ, షేక్ అహమ్మద్, షేక్ మహ్మద్ రఫీ, మైనుద్దీన్, మహ్మద్ సుల్తానా మియా, మహ్మద్ యాసిన్, మీనయ్య, సయ్యద్ అక్బర్, రూపాని వెంకన్న ఉండగా పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు



# దివ్యాంగ పిల్లలకు ఉచిత ఉపకరణాలు

- సెప్టెంబర్ 22న హుజురాబాద్‌లో నిర్ధారణ శిబిరం
- వీణవంక మండల విద్యాధికారిణి శోభారాణి

**(వీణవంక, జోర్దార్ ప్రతినిధి)**సమగ్ర శిక్ష కరీంనగర్ జిల్లా ఆధ్వర్యంలో దివ్యాంగ పిల్లలకు ఉచిత ఉపకరణాలు అందించేందుకు సెప్టెంబర్ 22న హుజురాబాద్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్ధారణ శిబిరం నిర్వహించనున్నట్లు వీణవంక మండల విద్యాధికారి శోభారాణి తెలిపారు. కృత్రిమ అవయవాల తయారీ సంస్థ అలిమ్కో ఆధ్వర్యంలో నిర్వహించే ఈ శిబిరంలో 0 నుంచి 18 సంవత్సరాల లోపు దివ్యాంగ పిల్లలకు అవసరమైన ఉపకరణాల కోసం అర్హతను నిర్ధారించనున్నారు.

శిబిరానికి హాజరయ్యే వారు ఆధార్ కార్డు, సదరం ధ్రువీకరణ పత్రం, యూడీఐడీ కార్డు, ఆహార భద్రత కార్డు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, బ్యాంకు పాస్‌బుక్ తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు.

నిపుణులు వివిధ రకాల వైకల్యాలను పరిశీలించి, అవసరమైన ఉపకరణాలను ఉచితంగా అందించేందుకు అర్హతను నిర్ధారిస్తారని తెలిపారు.



వీణవంక మండల పరిధిలోని దివ్యాంగ పిల్లలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో శోభారాణి కోరారు.

మరిన్ని వివరాలకు ఐఈఆర్‌పీ ఎం. రాజ్‌కుమార్ **9652444504**, సీహెచ్ శ్రీనివాసరాజు **9491139265** నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

RNI NO:TGTEL/25/A5224
జోర్దార్
JORDAR TELUGU DAILY తెలుగు దినపత్రిక
అవినీతి అంతం - మా పంతం
మంగళవారం,
సెప్టెంబర్ 22 2026



# కేయూ లోనీ ఫిజిక్స్ విభాగంలో

# పార్ట్ టైం అక్రమ నియామకాలు

- నోటిఫికేషన్ లో లేని రోస్టర్ ఎలా నింపారు....?
- బ్యాక్ లాగ్ ను వదిలి కరెంట్ రోస్టర్ ఎలా వచ్చింది....
- వీటి వెనుక ఉన్న ఓ.ఎస్.డీ వెంకట్రామ్ రెడ్డి పై తక్షణమే చర్యలు తీసుకోవాలి....
- సెలెక్షన్ కమిటీ మెంబర్లందరిపైనా కమీషన్ కు పిర్యాదు....?
- రిజిస్ట్రార్ ఛాంబర్ లో గిరిజన విద్యార్థుల ఆందోళన........

**(జోర్దార్ వరంగల్ ప్రతినిధి,)**కాకతీయ విశ్వవిద్యాలయం భౌతిక శాస్త్ర విభాగంలో రిజర్వేషన్ నిబంధనలు ఉల్లంఘించి నియామకం చేపట్టారంటూ గిరిజన విద్యార్థి సంఘాలు, విద్యార్థులు, పరిశోధక విద్యార్థులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు రిజిస్ట్రార్ ఛాంబర్‌లో బైఠాయించి తమ నిరసనను వ్యక్తం చేసి, రిజిస్ట్రార్‌కు వినతిపత్రం సమర్పించారు.

**"బ్యాక్‌లాగ్ పోస్టులను దాచిపెట్టేందుకు చూపిస్తున్నారు"**

వినతిపత్రంలో పేర్కొన్న ఆరోపణల ప్రకారం, భౌతిక శాస్త్ర విభాగంలోని ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులు నిబంధనల ప్రకారం భర్తీ కాలేదని, వాటిని భర్తీ చేయకుండా ను చూపిస్తున్నారని విద్యార్థి సంఘాలు ఆరోపించాయి. అదే సమయంలో, ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌కు సంబంధించిన రోస్టర్ పాయింట్‌గా పేర్కొనని స్థానంలో ఈడబ్ల్యూఎస్ అభ్యర్థిని నియమించారని వారు పేర్కొన్నారు. ఇది రిజర్వేషన్ రోస్టర్ విధానంపై అనుమానాలకు తావిస్తోందని, దీనిపై విశ్వవిద్యాలయ యంత్రాంగం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

**నియామకంపై సమగ్ర విచారణ, బాధ్యులపై క్రమశిక్షణా చర్యలకు డిమాండ్...**

ఈ వ్యవహారానికి సంబంధించి భౌతిక శాస్త్ర విభాగాధిపతి డా. జి. పద్మజ, బీఓఎస్ చైర్మన్ డా. ఎ. నరేందర్, సీనియర్ ప్రొఫెసర్ డా. వెంకట్రామ్ రెడ్డిల పాత్రపై కూడా పరిశీలన జరపాలని విద్యార్థి సంఘాలు కోరాయి. అయితే, ఇవన్నీ వినతిపత్రంలో విద్యార్థి సంఘాలు చేసిన ఆరోపణలేనని, వాటి వాస్తవాలను విశ్వవిద్యాలయ స్థాయిలో పరిశీలించాల్సి ఉందని వారు పేర్కొన్నారు.

**విద్యార్థి సంఘాలు రిజిస్ట్రార్‌ను కోరిన ప్రధాన డిమాండ్లు:**

- భౌతిక శాస్త్ర విభాగంలోని సంబంధిత నియామకంపై సమగ్ర విచారణ చేపట్టాలి.
- రిజర్వేషన్ రోస్టర్‌కు విరుద్ధంగా జరిగినట్లు తేలితే సంబంధిత నియామకంపై తగిన చర్యలు తీసుకోవాలి.
- నిబంధనల ఉల్లంఘనకు బాధ్యులుగా తేలిన వారిపై విశ్వవిద్యాలయ నిబంధనల ప్రకారం క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలి.
- పెండింగ్‌లో ఉన్న ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను నిబంధనల ప్రకారం అర్హులైన ఎస్టీ అభ్యర్థులతో భర్తీ చేయాలి.

రిజర్వేషన్ రోస్టర్, నియామక ప్రక్రియకు సంబంధించిన అన్ని రికార్డులను పరిశీలించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని, ఎస్టీ విద్యార్థులకు న్యాయం జరిగేలా తక్షణ చర్యలు చేపట్టాలని గిరిజన విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి.

# బదిలీ అయ్యాక మళ్లీ డిప్యూటేషన్ బాగోతమా?

- నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారంటూ ఆరోపణలు
- ఖాళీ పోస్టులను భర్తీ చేయకుండా అనుకూల వ్యక్తికి వెసులుబాటు?
- విచారణకు ఆదేశించాలని సామాజికవేత్త రాధాకృష్ణ డిమాండ్

**కరీంనగర్ జోర్దార్ వ్యవసాయ ప్రతినిధి:**కరీంనగర్ జిల్లా వ్యవసాయ శాఖలో బదిలీల వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వం నిర్వహించిన బదిలీల్లో కౌన్సెలింగ్ ప్రకారం స్థానాలు కేటాయించిన అనంతరం కూడా కొందరు ఉద్యోగులు పాత కార్యాలయాల్లోనే విధులు నిర్వహిస్తున్నారంటూ ఆ శాఖ ఉద్యోగుల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా కరీంనగర్ ఏడీఏ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఉద్యోగిని గత ఏప్రిల్‌లో మానకొండూరు ఏడీఏ కార్యాలయానికి బదిలీ చేసినప్పటికీ, తిరిగి కరీంనగర్‌లో విధులు నిర్వహించడంపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**బదిలీ ఉత్తర్వుల తర్వాత మళ్లీ పాత చోటే?**

బదిలీ ఉత్తర్వులు వెలువడిన తర్వాత నిబంధనలకు విరుద్ధంగా డిప్యూటేషన్ లేదా ఇతర పేర్లతో పాత కార్యాలయంలోనే విధులు కొనసాగించడంపై ఉద్యోగ వర్గాలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. మానకొండూరు ఏడీఏ కార్యాలయానికి బదిలీ అయిన ఉద్యోగిని తిరిగి కరీంనగర్ కార్యాలయంలో కొనసాగించడానికి కారణాలేమిటని ప్రశ్నిస్తున్నారు.

**హుజూరాబాద్‌లో పోస్టు ఖాళీ.. అయినా భర్తీ చేయరా?**

హుజూరాబాద్ ఏడీఏ కార్యాలయంలో సుమారు పది నెలలుగా జూనియర్ అసిస్టెంట్ పోస్టు ఖాళీగా ఉన్నప్పటికీ దానిని భర్తీ చేయకపోవడంపై కూడా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కరీంనగర్‌లో పనిచేస్తున్న జూనియర్ అసిస్టెంట్‌ను హుజూరాబాద్‌కు కేటాయించాల్సి ఉండగా, సమీపంలోని మానకొండూరుకు బదిలీ చేయడంపై ఉద్యోగులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం.

**ఉన్నతాధికారులపై ఒత్తిళ్ల ఆరోపణలు**

గతంలో సిరిసిల్ల జిల్లా కలెక్టర్ ఆగ్రహానికి గురై సరెండర్ అయిన ఒక అధికారి జిల్లా వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులపై ఒత్తిడి తెచ్చి తనకు అనుకూలమైన వ్యక్తికి పోస్టింగ్ ఇప్పించారని సామాజికవేత్త రాధాకృష్ణ ఆరోపించారు. ఈ వ్యవహారంలో అవినీతి, అక్రమాలు జరిగాయంటూ ముఖ్యమంత్రి, వ్యవసాయ శాఖ మంత్రికి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కరీంనగర్ ఏడీఏ కార్యాలయంలో కొంతకాలంగా జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్న బదిలీలు, డిప్యూటేషన్లు, విధుల కేటాయింపులపై సమగ్ర విచారణ జరిపించాలని రాధాకృష్ణ డిమాండ్ చేశారు. నిబంధనలు ఉల్లంఘించి ఎవరైనా ప్రయోజనం పొందితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులు, సదరు ఉద్యోగుల అధికారిక వివరణ వెలువడాల్సి ఉంది.

# ఆత్మ నిధుల స్వాహా

## కిసాన్ మేళాలపై సమగ్ర విచారణకు డిమాండ్

రాష్ట్రంలో ఆత్మ నిధుల విడుదలపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఫిబ్రవరిలో బడ్జెట్ విడుదల కాగా, సెప్టెంబర్ 21న విధివిధానాలు జారీ చేయడం అనుమానాలకు తావిస్తోంది. కొన్ని జిల్లాల్లో జిల్లా వ్యవసాయ అధికారులు, ఏడీఏలు ఎలాంటి కిసాన్ మేళాలు నిర్వహించకుండానే రూ. 6 లక్షల చొప్పున నిధులను స్వాహా చేశారనే ఆరోపణలు వస్తున్నాయి. ప్రభుత్వ ఆదేశాలను, మార్గదర్శకాలను పూర్తిగా విస్మరించి నిధులు డ్రా చేసిన యంత్రాంగంపై సమగ్ర విచారణ చేపట్టాలి. అవకతవకలకు పాల్పడిన అధికారులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

**బడ్జెట్ కేటాయింపులు మరియు ఆలస్యమైన విధివిధానాలు:**

తెలంగాణ వ్యాప్తంగా వ్యవసాయ రంగాన్ని ప్రోత్సహించడానికి, రైతులకు ఆధునిక సాంకేతికతను చేరువ చేయడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఆత్మ పథకాన్ని అమలు చేస్తున్నాయి. ఇందులో భాగంగా జిల్లా స్థాయిలో కిసాన్ మేళాల నిర్వహణ కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా బడ్జెట్‌ను కేటాయిస్తుంది. అయితే, ఈ నిధుల నిర్వహణ మరియు ఖర్చుల విషయంలో క్షేత్రస్థాయిలో తీవ్రమైన అక్రమాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఫిబ్రవరి నెలలోనే బడ్జెట్‌ను జిల్లాలకు విడుదల చేసినప్పటికీ, దానికి సంబంధించిన కఠినమైన విధివిధానాలు, మార్గదర్శకాలను మాత్రం చాలా కాలం తర్వాత సెప్టెంబర్ 21వ తేదీన విడుదల చేయడం అనేక సందేహాలకు తావిస్తోంది. నిబంధనలు రాకముందే నిధులు ఎలా విడుదలయ్యాయి, ఆ నిధులను ఏ ప్రాతిపదికన ఖర్చు చేశారనే దానిపై అధికారుల నుంచి స్పష్టత కరువైంది.

**నిర్వహణ లేకపోయినా నిధులు డ్రా - అధికారుల లీలలు:**

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి జిల్లాలోనూ కలెక్టర్ లేదా ఛైర్మన్ ఆత్మ ఆధ్వర్యంలో కనీసం 1,000 మంది రైతులతో భారీ ఎత్తున కిసాన్ మేళా నిర్వహించాలి. వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్ధక శాఖలతో పాటు కేవీకే శాస్త్రవేత్తలు, ఎఫ్‌పీవోల భాగస్వామ్యంతో కనీసం 40 స్టాల్స్ ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఆహారం, రవాణా, ఫ్లెక్సీలు, హాల్ ఛార్జీలు, డాక్యుమెంటేషన్ తదితర ఖర్చుల నిమిత్తం ఒక్కో జిల్లాకు రూ. 6,00,000 కేటాయించారు. కానీ, క్షేత్రస్థాయిలో చాలా జిల్లాల్లో ఎలాంటి సమావేశాలు, కిసాన్ మేళాలు నిర్వహించకుండానే జిల్లా వ్యవసాయ అధికారులు , ఏడీఏలు మరియు సంబంధిత యంత్రాంగం కుమ్మక్కై రూ. 6 లక్షల చొప్పున నిధులను స్వాహా చేసినట్లు తీవ్రమైన ఆరోపణలు వస్తున్నాయి. అసలు మేళాలే జరగనప్పుడు ఆ డబ్బులు ఎటుపోయాయనే ప్రశ్న ఇప్పుడు ప్రధానంగా వినిపిస్తోంది.

**అధికారుల రక్షణే లక్ష్యంగా తంతు?**

ఫిబ్రవరిలో బడ్జెట్ ఇచ్చి, సెప్టెంబర్‌లో విధివిధానాలు విడుదల చేయడం వెనుక పెద్ద తంతే నడిచిందనే విమర్శలు ఉన్నాయి. క్షేత్రస్థాయిలో నిధులు దుర్వినియోగం అయినట్లు వస్తున్న వార్తలు నిజమని తేలితే, ఆ అధికారులను కాపాడడానికే ఆలస్యంగా ఈ మార్గదర్శకాలను తెరపైకి తెచ్చారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ ఆదేశాలను, ఉత్తర్వులను తుంగలో తొక్కి, ఎలాంటి కార్యక్రమాలు చేపట్టకుండానే ప్రజాధనాన్ని స్వాహా చేయడం ప్రభుత్వ పాలనా వ్యవస్థను ఎద్దేవా చేయడమే అవుతుంది.

**రైతు సంఘాల ఆగ్రహం - సమగ్ర విచారణకు డిమాండ్:**

అన్నదాతల సంక్షేమం కోసం కేటాయించిన నిధులను దారి మళ్లించి, అవినీతికి పాల్పడుతున్న అధికారులపై ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

రాష్ట్రంలోని ఏయే జిల్లాల్లో కిసాన్ మేళాలు జరిగాయి? ఎక్కడెక్కడ రూ. 6 లక్షల చొప్పున నిధులు డ్రా అయ్యాయి? అనే అంశాలపై సిట్టింగ్ లేదా ఉన్నతాధికారులతో సమగ్ర విచారణ జరిపించాలి.

ప్రభుత్వ విధివిధానాలను ఉల్లంఘించి, అక్రమాలకు పాల్పడిన ప్రతి ఒక్క అధికారిపై శాఖపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు, రికవరీ చేసి తగిన శిక్ష విధించాలని రైతు లోకం కోరుతోంది.

లేనిపక్షం లో రైతు సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరిస్తున్నారు.

# పాల ట్యాంకర్ బోల్తా, రోడ్డుపై ఒలికిన పాలు.. పట్టుకునేందుకు ఎగబడిన స్థానికులు

**ముంబై:** ఒక పాల ట్యాంకర్ రోడ్డుపై బోల్తాపడింది. దీంతో ఆ ట్యాంకర్‌లోని పాలు ధారగా ఒలికిపోయాయి. గమనించిన స్థానికులు బాటిల్స్‌లో పాలు నింపుకునేందుకు ఎగబడ్డారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. మహారాష్ట్రలోని పాల్ఘర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ఒక పాల ట్యాంకర్ గుజరాత్‌లోని అహ్మదాబాద్ నుంచి మహారాష్ట్ర రాజధాని ముంబైకు బయలుదేరింది. అయితే సోమవారం ఉదయం దహాను తాలూకాలోని



తవా గ్రామం సమీపంలో ముంబై-అహ్మదాబాద్ జాతీయ రహదారిపై అది బోల్తాపడింది. కాగా, ప్రమాదం ధాటికి ట్యాంకర్‌లోని పాలు లీక్ అయ్యాయి. వందలాది లీటర్ల పాలు నేలపాలయ్యాయి.

రోడ్డుపై ఒలికిపోయాయి. దీంతో పాల నదిలా అక్కడ కనిపించింది. గమనించిన స్థానికులు సీసాలు, డబ్బాలతో అక్కడకు చేరు కున్నారు. ట్యాంకర్ నుంచి ఒలికిపోతున్న పాల ను వాటిల్లో నింపుకున్నారు.

మరోవైపు ఈ ప్రమాదం కారణంగా ఆ జాతీయ రహదారిలో ట్రాఫిక్‌కు కొంతసేపు అంతరాయం ఏర్పడింది.

ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.

అయితే ట్యాంకర్ నుంచి ఒలికిపోతున్న పాలను స్థానికులు బాటిల్స్, టిన్స్‌లో నింపుకున్న వీడియో క్లిప్స్ సోషల్ మీడి యాలో వైరల్ అయ్యాయి

# కాజీపేట( దర్గా) పిఏసిఎస్

## ఛైర్మెన్‌గా ప్రమాణ స్వీకారం.!





- నూతనంగా బాధ్యతలు స్వీకరించిన గంగుల శ్రీనివాస్ రెడ్డి .

**హనుమకొండ,జోర్దార్ ప్రతినిధి:**కాజీపేట దర్గా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఛైర్మెన్, డైరెక్టర్లుగా బాధ్యతలు స్వీకరించి ప్రమాణస్వీకారం చేయడం జరిగింది . ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన చైర్మన్ గంగుల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రైతుల,రుణాలు, ఎరువులు, పనిముట్లకు, వడ్లు, మక్కజొన్న కొనగోలు కేంద్రాలను అందుబాటులో ఉండే విధంగా, రైతులకు సహాయ సహకారాలు అందిస్తానని మాట్లాడారు. గతంలో పిఎసిఎస్ లో మూడు సార్లు డైరెక్టర్గా, వైస్ చైర్మన్గా, బాధ్యతలు నిర్వహించిన అనుభవం ఉందన్నారు. రైతులకు సేవ చేయడమే నా కర్తవ్యం అన్నారు. రైతులకు సొసైటీ నుండి రావలసినటువంటి సకాలంలో వచ్చే విధంగా మా పాలకవర్గం పనిచేస్తుందన్నారు. అలాగే రైతులకు ఏ విషయం కావాలన్నా ఆయా గ్రామాలలో ఉండే డైరెక్టర్లను నేరుగా సంప్రదించగలరని చెప్పారు. రైతులకు సేవ చేయడమే మా కర్తవ్యం గా మా పాలకవర్గం చేస్తుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలన రైతే దేశానికి రాజు అనే విధంగా పనిచేస్తుందన్నారు. అందులో భాగంగానే మా బాధ్యతలను కూడా నిస్వార్థంగా రైతులకు సేవ చేస్తామని చైర్మన్ మాట్లాడారు.ఈ కార్యక్రమము లో హన్మకొండ జిల్లా అధ్యక్షులు ఇనుగాల వెంకట్రామారెడ్డి , హసనపర్తి పి ఎ సి ఎస్ చైర్మెన్ పింగిలి వెంకట్రామ్ నర్సింహారెడ్డి ,కాంగ్రెస్ యువ నాయకులు విష్ణు వర్ధన్ రెడ్డి , కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్,44 డివిజన్ అధ్యక్షులు జక్కుల సదానందం, 45 డివిజన్ అధ్యక్షులు కర్ర హరీష్ రెడ్డి ,46 డివిజన్ అధ్యక్షులు వస్కుల శ్రీను, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు నియోజకవర్గ నాయకులు, తదితర మండల నాయకులు కాంగ్రెస్ పార్టీ అనుసంధ సంఘాల నాయకులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# హనుమకొండ ఎంఈఓ లీలలు

- సర్దుబాట్ల పేరుతో నచ్చినట్లు వ్యవహారం?
- పాఠశాలలో ఉండాల్సిన ఉపాధ్యాయుడు.. ఎంఈఓ కార్యాలయంలో విధులు!

**హనుమకొండ, జోర్దార్ ప్రతినిధి:**హనుమకొండ మండల విద్యాశాఖలో ఉపాధ్యాయుల సర్దుబాటు వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. ఉపాధ్యాయుల సర్దుబాటును నిబంధనలకు విరుద్ధంగా తనకు నచ్చిన విధంగా మార్చుకుంటున్నారంటూ ఎంఈఓపై ఉపాధ్యాయ సంఘాలు, సామాజిక కార్యకర్తలు ఆరోపణలు చేస్తున్నారు.

సుబేదారి జీహెచ్ఎస్‌లో సోషల్ స్టడీస్ సబ్జెక్టుకు ముగ్గురు ఎస్ఏ ఉపాధ్యాయులు ఉండగా, వారిలో ఒకరు మిగులుగా ఉన్నట్లు సమాచారం.అవసరమైన పాఠశాలకు ఆ ఉపాధ్యాయుడిని సర్దుబాటు చేయాల్సి ఉన్నప్పటికీ.. సంబంధిత డీఈఓకు సమాచారం ఇవ్వకుండా, గత కొంతకాలంగా గర్ల్స్ హైస్కూల్ పెట్రోల్ పంపులో అనధికారిక డిప్యూటేషన్‌పై పనిచేయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఇదే సమయంలో అక్కడి రెగ్యులర్ ఎస్ఏ సోషల్ ఉపాధ్యాయుడిని హనుమకొండ ఎంఆర్సీ(ఎంఈఓ కార్యాలయం)లో బోధనేతర పనులకు వినియోగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉన్న పరిస్థితుల్లో..

పాఠశాలలో బోధించాల్సిన ఉపాధ్యాయులను కార్యాలయ పనులకు వినియోగించడం ఎంత వరకు సమంజసమని ఉపాధ్యాయ సంఘాలు ప్రశ్నిస్తున్నాయి.డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్, తెలంగాణ రాష్ట్రం, హైదరాబాద్ జారీ చేసిన ఆర్‌సీ నంబర్ 1842/సెర్-IV-2/2018, తేదీ 15-12-2018 ఉత్తర్వుల ప్రకారం ఉపాధ్యాయులను బోధనేతర పనుల్లో



PROCEEDINGS OF THE DIRECTOR OF SCHOOL EDUCATION, TELANGANA :: HYDERABAD.

Rc.No.1842/Ser.IV-2/2018 Dated:15.12.2018

Sub: School Education - Request for cancellation of deputations to the employees who are working at MRC and DEO offices - Reg.

Read: Lr.No.97/TPRTU/2018, Dated:16.11.2018 from the president PRTU.

****

While enclosing here with a copy of reference read above, the Regional Joint Director of School Education, Warangal and Hyderabad and all the District Educational Officer in the state are requested to examine the issue in detail and take necessary immediate action in the matter as per rules in vogue.

Sd/- P.V. SRI HARI
for Director of School Education

ఉంచకూడదని స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయని సంఘాలు పేర్కొంటున్నాయి.

అయినప్పటికీ సంబంధిత ఆదేశాలను పట్టించుకోకుండా పాఠశాలలో ఉండాల్సిన ఉపాధ్యాయుడిని ఎంఈఓ కార్యాలయంలో విధులకు వినియోగిస్తున్నారంటూ ఆరోపిస్తున్నారు. ఉపాధ్యాయుల కొరతతో పాఠశాలల్లో విద్యార్థులకు ఇబ్బందులు ఎదురవుతున్న సమయంలో ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు దృష్టిసారించాలని ఉపాధ్యాయ సంఘాలు, సామాజిక కార్యకర్తలు కోరుతున్నారు.

నిబంధనలను పరిశీలించి, పాఠశాలలో ఉండాల్సిన ఉపాధ్యాయులను వెంటనే వారి విధులకు పంపించాలని డిమాండ్ చేస్తున్నారు.

మంగళవారం,
సెప్టెంబర్ 22 2026

RNI NO.TGTEL/25/A5224
జోర్దార్
JORDAR TELUGU DAILY తెలుగు దినపత్రిక
అవినీతి అంతం - మా పంతం



# కేసీఆర్ ఫామ్‌హౌస్ చుట్టూ కొనసాగుతున్న భూసర్వే.. రంగంలోకి రెవెన్యూ అధికారులు



**ఎర్రవల్లి:** ఎర్రవల్లిలో భూములపై కొనసాగుతున్న రెవెన్యూ సర్వే సర్వే నంబర్ 325పై అధికారుల ప్రత్యేక దృష్టి మొత్తం 388 ఎకరాల భూముల పరిశీలన శాటిలైట్ మ్యాపింగ్‌తో భూముల హద్దుల పరిశీలన ఆక్రమణలని తేలితే భూముల స్వాధీనానికి చర్యలు సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం ఎర్రవల్లి గ్రామంలో మాజీ సీఎం కేసీఆర్ ఫామ్‌హౌస్ పరిసర భూములపై రెవెన్యూ అధికా రులు సర్వే కొనసాగిస్తున్నారు. ఎర్రవల్లితో పాటు వెంకటాపూర్, వరదరాజుపూర్ సరిహద్దుల్లో ఉన్న భూములను క్షుణ్ణంగా పరిశీ లిస్తున్నారు. ఆదివారం సెలవు కావడంతో నిలిచిన సర్వే.. సోమ వారం ఉదయం తిరిగి ప్రారంభమైంది.సర్వే నంబర్ 325 పరిధిలో ఉన్న ప్రభుత్వ, అసైన్డ్ భూములపై అధికారులు ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. మొత్తం 388 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ భూముల్లో ప్రభుత్వ భూమి ఎంత? అసైన్డ్ భూమి ఎంత? ప్రస్తుతం ఎవరి అధీనంలో ఉంది? ప్రైవేటు పట్టా భూము లు ఎంతమేర ఉన్నాయి? అనే వివరాలను సేకరిస్తున్నారు. అసిస్టెంట్ డైరెక్టర్ సుదర్శన్ రాథోడ్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ సేవ్యానాయక్, గజ్వేల్ ఆర్డీవో చంద్రకళ, స్థానిక తహసీల్దార్లతో కూడిన ప్రత్యేక బృందాలు సర్వేలో పాల్గొంటున్నాయి. శాటిలైట్ మ్యాపింగ్, ఆధునిక సాంకేతికతతో పాటు పాత రెవెన్యూ రికార్డులను పరిశీలిస్తూ భూముల హద్దులను నిర్ధారిస్తున్నారు. సర్వే నంబర్ 35 పరిధిలో భూములు ఉన్న 100 మందికి పైగా రైతుల కు ఇప్పటికే అధికారులు నోటీసులు ఇచ్చారు. పట్టాదార్ పాస్‌పుస్తకాలు, ఇతర యాజమాన్య పత్రాలతో సర్వే ప్రాంతానికి రావాలని సూచించారు.ఫామ్‌హౌస్ పరిసర భూముల కేటాయింపులు, ధరణి రికార్డుల్లో అక్రమాలపై ఇటీవల అసెంబ్లీలో చర్చ జరిగిన నేపథ్యంలో ఈ విచారణ చేపట్టినట్లు అధికారులు తెలిపారు. సర్వే పూర్తయ్యాక సమగ్ర నివేదికను ఉన్నతాధికారులకు, ప్రభుత్వానికి అందజేయనున్నారు. ప్రభుత్వ లేదా అసైన్డ్ భూములు ఆక్రమణకు గురైనట్లు తేలితే.. నిబంధనల ప్రకారం స్వాధీనం చేసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు.

# పదేళ్ల పాలనలో కేసీఆర్ కుటుంబం అడ్డగోలుగా దోచుకుంది




**హైదరాబాద్ :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా పాలన చేస్తూ ప్రజల మద్దతు పొందుతుంటే 22ఏ అంటూ రాజకీయాలు చేస్తున్నారని బీఆర్ఎస్‌పై టీపీసీసీ సీనియర్ నేత రమ్యారావు మండిపడ్డారు. పదేళ్ల పాలనలో కేసీఆర్ కుటుంబం అడ్డగోలుగా దోచుకుందని విమర్శించారు. సోమవారం గాంధీ భవన్‌లో మీడియాతో ఆమె మాట్లాడారు. 'మాకు వందల ఎకరాలు ఉన్నాయని కేటీఆర్ అంటున్నారు. నేను కేసీఆర్ సొంత అన్న బిడ్డను. కేటీఆర్ ఆరోపిస్తున్నట్లుగా ఆ వందల ఎకరాలలో మా భూమి ఎక్కడ ఉంది? నేను, కవిత ఇద్దరం ఇంటి వాళ్లం. మేము కాకుండా సంబంధంలేని సంతోష్ రావు కేసీఆర్ దగ్గర ఎందుకు ఉంటున్నాడు? ఆయన అడ్డగోలుగా సంపాదించి నన్ను, కవితను ఇంటి నుంచి బయటకు పంపిస్తే నువ్వు (కేటీఆర్) ఎందుకు మౌనంగా ఉంటున్నావు? నీకు సంతోష్ బినామీనా? ఎందుకు భయపడుతున్నావు?' అని రమ్యారావు వ్యాఖ్యానించారు.సంతోష్ రావుకు 2013లో క్వారీలో 25 శాతం వాటా ఉండేదని, 2015లో బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రాజెక్టులో ముంపుకు గురైందంటూ సంతోష్ ఇంటి వాళ్లందరూ ఇళ్ల పట్టాలు తీసుకున్నారని ఆమె ఆరోపించారు. కుదురుపాక గ్రామానికి సంబంధం లేని వారు కూడా ప్లాట్లు తీసుకున్నారని విమర్శించారు. కుదురుపాక గ్రామంలో ఒక్క సంతోష్ రావు, ఆయన కుటుంబ సభ్యులు కలిసి 8 ప్లాట్లు తీసుకున్నారని ఆమె ఆరోపించారు. '2018లో సంతోష్ రావుకు రాజ్యసభలో అవకాశం ఇచ్చారు. ఆ సందర్భంగా సంతోష్ ఒక్క ప్లాట్‌ను మాత్రమే అఫిడవిట్‌లో చూపించారు. 8 ప్లాట్లు తీసుకుని ఒక్క ప్లాటే ఎలా చూపించారు? 200 గజాల భూమిని కూడా వదలకుండా అడ్డగోలు అక్రమాలకు పాల్పడ్డారు. అంతేకాకుండా కుదురుపాక గ్రామంలో మెయిన్ రోడ్డులో బాధితుల భూములను అడ్డగోలుగా కొన్నాడు' అని రమ్యా రావు పేర్కొన్నారు

# హైదరాబాద్ ట్యాంక్ బండ్ వద్ద ఉద్రిక్తత.. నిమజ్జనానికి అనుమతి ఇవ్వాలంటూ నిరసన.




**హైదరాబాద్:** నగరంలోని ట్యాంక్ బండ్ వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ట్యాంక్ బండ్‌పై గణేశ్ విగ్రహాల నిమజ్జనానికి అనుమతి ఇవ్వకపోవడాన్ని నిరసిస్తూ భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి ప్రతినిధులు ఆందోళనకు దిగారు. నిమజ్జనంపై ఆంక్షలు ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ ట్యాంక్ బండ్ వద్ద బైఠాయించారు. నిరసనలో భాగంగా అక్కడ చుట్టూ ఏర్పాటు చేసిన బారికేడ్లను ఉత్సవ సమితి ప్రతినిధులు తొలగించారు. వారిని పోలీసులు అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. ఈ క్రమంలో పలువురు పోలీసులు కిందపడిపోయారు. దీంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది.ఈ సందర్భంగా ట్యాంక్ బండ్‌పై గణేశ్ నిమజ్జనానికి అనుమతి ఇవ్వాల్సిందేనని భాగ్యనగర్ ఉత్సవ సమితి ప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు. బారికేడ్లను తొలగించిన అనంతరం వారు అక్కడే బైఠాయించి నిరసన కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమై ట్యాంక్ బండ్ పరిసరాల్లో భారీగా మోహరించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా భద్రతను కట్టుదిట్టం చేశారు. కాగా, గణేశ్ నిమజ్జనం వేళ ట్యాంక్ బండ్ వద్ద ఆంక్షలపై ఉత్సవ సమితి అభ్యం తరం వ్యక్తం చేస్తోంది. నిమజ్జన కార్యక్రమానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినప్పటికీ, ట్యాంక్ బండ్ వద్ద సంప్రదాయబద్ధంగా నిర్వహించేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతోంది. ఈ నేపథ్యంలోనే తాజాగా ట్యాంక్ బండ్ వద్ద నిరసనకు దిగడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.

# తెలంగాణ రైతులకు అలర్ట్.. సెప్టెంబర్ 30లోగా ఈ పని పూర్తి చేయాలి!



**హైదరాబాద్ :** తెలంగాణ రైతులకు ప్రభుత్వం కీలక సూచన చేసింది. ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకోవాలని స్పష్టం చేసింది. రైతులకు ప్రత్యేక గుర్తింపు కల్పించడంతో పాటు ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, రాయితీలు సులభంగా అందించేందుకు ఈ విధానాన్ని తీసుకొచ్చారు. ఇందులో నమోదు చేసుకున్న ప్రతి రైతుకు ప్రత్యేకమైన ఫార్మర్ ఐడీ వస్తుంది.రైతుల నమోదు కోసం సెప్టెంబర్ 22 నుంచి 30వ తేదీ వరకు గ్రామాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ సమయంలో అధికారులు గ్రామాల్లోకి వచ్చి రైతుల రిజిస్ట్రేషన్ చేస్తారు. అక్కడే రైతులు తమ వివరాలను నమోదు చేసుకోవచ్చు. అలాగే మండలంలోని వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) వద్ద లేదా మీ సేవ కేంద్రంలోనూ రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం ఉంది.ఇప్పటికే ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకున్న రైతులు మళ్లీ నమోదు చేసుకోవాల్సిన అవసరం లేదు. రిజిస్ట్రేషన్ పూర్తయిన తర్వాత వచ్చే ఫార్మర్ ఐడీ నంబర్‌ను జాగ్రత్తగా గుర్తుపెట్టుకోవాలి. పీఎం కిసాన్, రైతు భరోసా వంటి పథకాలకు ఈ ఐడీ అవసరం అవుతుంది.రిజిస్ట్రేషన్‌కు ఏం కావాలిఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకోవడానికి ఆధార్ కార్డు, పట్టాదారు పాస్‌బుక్, ఆధార్‌కు లింక్ అయిన మొబైల్ నంబర్ అవసరం.ఫార్మర్ ఐడీతో ఏం ఉపయోగం?ఫార్మర్ ఐడీ ఉంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు, సేవలు, రాయితీలు, సబ్సిడీలు పొందేందుకు ఉపయోగపడుతుంది. బ్యాంకుల ద్వారా పంట రుణాలు పొందడంలోనూ ఇది సహాయపడుతుంది. ఎరువుల బుకింగ్‌కు ఉపయోగించే ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఫర్టిలైజర్ యాప్‌లోనూ ఇది అవసరం. వరి, పత్తి, మొక్కజొన్న, కంది వంటి పంటలకు కనీస మద్దతు ధర పొందే ప్రక్రియలోనూ ఫార్మర్ ఐడీ ఉపయోగపడుతుంది.

ఫార్మర్ ఐడీ ఎలా తెలుసుకోవాలి?

ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులు తమ ఫార్మర్ ఐడీని ఆన్‌లైన్‌లో తెలుసుకోవచ్చు. ముందుగా ఫార్మర్ రిజిస్ట్రీ అధికారిక వెబ్‌సైట్‌ను తెరవాలి. ఆధార్ నంబర్ ఆప్షన్‌ను ఎంచుకోవాలి. మీ ఆధార్ నంబర్‌ను నమోదు చేయాలి. ఆధార్‌కు లింక్ అయిన మొబైల్ నంబర్‌కు వచ్చిన ఓటీపీని ఎంటర్ చేసి సబ్మిట్ చేస్తే మీ ఫార్మర్ ఐడీ నంబర్ స్క్రీన్‌పై కనిపిస్తుంది.

కాబట్టి ఇప్పటికే నమోదు చేసుకోని రైతులు సెప్టెంబర్ 30లోగా ఈ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని ప్రభుత్వం సూచిస్తోంది.

# మద్దూర్‌లో జగదీశ్ రెడ్డి ఫామ్‌హౌస్ పరిశీలించిన టీకాంగ్ నేతలు



**హైదరాబాద్ :** బీఆర్ఎస్ నేతలకు చెందినవని ఆరోపిస్తూ, ఆ భూముల నిజాలు నిగ్గుతేల్చేందుకు కాంగ్రెస్ నేతలు గత మూడు రోజులుగా బృందంగా పర్యటిస్తున్నారు. ఇందులో భాగంగా నాలుగోరోజు హస్తం పార్టీ ప్రజాప్రతినిధుల నిజనిర్ధారణ బృందం రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం మద్దూర్ చేరుకున్నారు. నాలుగోరోజు క్షేత్రస్థాయి భూముల పరిశీలనలో భాగంగా ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు పర్యటించారు.గత ప్రభుత్వంలో అవినీతి అక్రమాలు, భూ కబ్జాలు జరిగాయని అవి ప్రజలకు చూపించేందుకే వెళ్తున్నామని కాంగ్రెస్ ప్రజా ప్రతినిధుల బృందం వెల్లడించింది. ప్రజాభవన్ నుంచి బయలుదేరిన నిజనిర్ధారణ కమిటీ సభ్యులు బీఆర్ఎస్? నేతలపై తీవ్ర విమర్శలు చేశారు. ప్రజా భవన్ నుంచి బస్సులో బయలుదేరారు. మాజీ మంత్రి జగదీశ్ రెడ్డికి సంబంధించిన భూములను ప్రజలకు చూపిస్తామని తెలిపారు. మద్దూర్‌లో 50 ఎకరాల్లో జగదీశ్‌రెడ్డి ఫామ్‌హౌస్ ఉందని, 50 ఎకరాల్లో ఇనామ్ భూములు ఉన్నాయని కాంగ్రెస్ నేతల ఆరోపించారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని జగదీశ్‌రెడ్డి చెరువు కాల్వలు కాజేశారని వెల్లడించారు. జగదీష్ రెడ్డి 50 ఎకరాల భూమి ఫామ్ హౌస్ మ్యాప్ కాంగ్రెస్ ప్రజా ప్రతినిధుల బృందం విడుదల చేసింది. ఇందులోనే 11 ఎకరాల ఇనామ్ భూములు ఉన్నట్లు ఆరోపించారు. ఇవాళ్టి కాంగ్రెస్ ప్రజా ప్రతినిధుల నిజనిర్ధారణ కమిటీ పర్యటన ముగిసింది.కాంగ్రెస్ నేతలు విడుదల చేసిన ఫామ్ హౌస్ మ్యాప్మాజీ సీఎం కేసీఆర్ ఫామ్‌హౌస్ చుట్టూ ఉన్న 300 ఎకరాల అసైన్డ్ భూమిని పేదలకు ఎందుకు పంచి ఇవ్వలేదని చామల కిరణ్? కుమార్ రెడ్డి ప్రశ్నించారు. ఉన్నది పేదలకు పంచి ఇవ్వాలని గతంలో నాయకులు ఆలోచించేవారని, కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో మాత్రం దోచుకుంటున్నారని విమర్శించారు."కేసీఆర్ ఫామ్‌హౌస్ చుట్టూ ఉన్న 300 ఎకరాల అసైన్డ్ భూమిని పేదలకు ఎందుకు పంచి ఇవ్వలేదు. ఉన్నది పేదలకు పంచి ఇవ్వాలని గతంలో నాయకులు ఆలోచించేవారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో మాత్రం దోచుకుంటున్నారు. ఉద్యమ సమయంలో లేని ఆస్తులు అధికారంలోకి వచ్చాక ఎలా వచ్చాయి?. 162/223 సర్వే నెంబర్‌లో 50 ఎకరాలు ఎక్కడి నుంచి సంపాదించారు?. బలిదానాలుతో వచ్చిన తెలంగాణలో ఫామ్‌హౌస్ సంస్కృతి తీసుకొచ్చారు. 50 ఎకరాల్లో ఇనామ్ భూములు ఉన్నాయి. ఈ ఫామ్‌హౌస్‌లో ఇనామ్ భూములు ఉంటే పేదలకు పంచాలి"

# బండ్లగూడ ఆర్టీవో ఆఫీసులో ఏసీబీ ఆకస్మిక తనిఖీలు.. ముగ్గురు అధికారులపై సస్పెన్షన్ వేటు




**హైదరాబాద్, సెప్టెంబర్ 21 :** బండ్లగూడ ఆర్టీవో ఆఫీసులో ఏసీబీ అధికారులు (సోమవారం) ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఆర్టీవో అధికారులపై ఆయా వాహనదారుల నుంచి పలు ఫిర్యాదులు అందడంతో ఏసీబీ రంగంలోకి దిగినట్లు సమాచారం. తమ దగ్గర సరైన కాగితాలు ఉన్నా ఆర్టీవో కార్యాలయం చుట్టూరా తిప్పుకుంటున్నారని వాహనదారులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అలాగే, కానిస్టేబుల్ అరుణ్ కార్యాలయంలోని చాంబర్‌లో నగదు లెక్కిస్తున్న వీడియో దృశ్యాలు రికార్డయ్యాయి.నగదు లెక్కిస్తున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ క్రమంలోనే ఏసీబీ అధికారుల సోదాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఆర్టీవో అధికారులను ఏసీబీ బృందం ప్రశ్నిస్తోంది. ఆర్టీవో కార్యాలయంలో గంటకు పైగానే సోదాలు కొనసాగుతున్నాయని సమాచారం. ఏసీబీ అధికారులు ఆయా ఫైళ్లను నిశితంగా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. తనిఖీలు పూర్తయిన తర్వాత పూర్తి వివరాలు వెల్లడయ్యే

# ట్యాంక్‌బండ్ వద్ద తీవ్ర ఉద్రిక్తత.. పోలీసులతో ఉత్సవ సమితి ఘర్షణ.. బారికేడ్లు తొలగింపు!



**హైదరాబాద్:** హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై గణేశ్ విగ్రహాల నిమజ్జనం అంశం మరోసారి తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. హుస్సేన్‌సాగర్‌లో ట్యాంక్ బండ్ వైపు విగ్రహాల నిమజ్జనానికి అనుమతి లేదంటూ అధికారులు ఏర్పాటు చేసిన ఆంక్షలను వ్యతిరేకిస్తూ భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి ఆందోళనకు దిగింది. ఈ క్రమంలో ఉత్సవ సమితి ప్రతినిధులకు, పోలీసులకు మధ్య తీవ్ర వాగ్వాదం, తోపులాట చోటుచేసుకున్నాయి. దీంతో ట్యాంక్‌బండ్ పరిసరాల్లో హైటెన్షన్ వాతావరణం నెలకొంది.వివరాల్లోకి వెళితే.. ట్యాంక్‌బండ్‌పై నిమజ్జనాలకు అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఉత్సవ సమితి ప్రతినిధులు అక్కడ బైఠాయించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ జీహెచ్ఎంసీ ఏర్పాటు చేసిన కొన్ని బారికేడ్లను తొలగించేందుకు ప్రయత్నించారు. వారిని పోలీసులు అడ్డుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఈ తోపులాటలో కొందరు పోలీసులు కిందపడిపోయినట్లు సమాచారం. అప్రమత్తమైన ఉన్నతాధికారులు అదనపు బలగాలను మోహరించి పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు.మరోవైపు తెలంగాణ హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగానే పర్యావరణ పరిరక్షణ కోసం హుస్సేన్‌సాగర్‌లో, ముఖ్యంగా ట్యాంక్‌బండ్‌పై ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీఓపీ) విగ్రహాల నిమజ్జనాన్ని నియంత్రిస్తున్నట్లు జీహెచ్ఎంసీ, పోలీసు అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఇందులో భాగంగానే టఇక్కడ నిమజ్జనం నిషిద్ధమంటూ ఫ్లెక్సీలను కూడా పెట్టారు.అయితే, ప్రభుత్వం ప్రత్యామ్నాయ వ్పాట్లపై దృష్టి సారించింది. ఎన్టీఆర్ మార్గ్, పీపుల్స్ ప్లాజా, నెక్లెస్ రోడ్ ప్రాంతాల్లో మట్టి, పర్యావరణ హిత విగ్రహాల నిమజ్జనం కోసం క్రేన్లను సిద్ధం చేస్తున్నారు. పీఓపీ విగ్రహాల కోసం ప్రత్యేకంగా కృత్రిమ కొలనులను (బేబీ పాండ్స్) ఏర్పాటు చేస్తున్నారు.

# పెద్దాసుపత్రుల్లో రోగుల కష్టాలు - రాత్రుల్లో చుక్కలు చూపిస్తున్న వైద్యులు




**హైదరాబాద్:** హైదరాబాద్‌కు చెందిన ఓ గర్భిణికి అర్ధరాత్రి పురిటి నొప్పులు రావడంతో వెంటనే నిలోఫర్ ఆస్పత్రికి తరలించారు. ఆమెను అత్యవసర విభాగంలో చేర్చారు. నొప్పులతో అవస్థలు పడుతోందని ఆమె కుటుంబ సభ్యులు వైద్య సిబ్బంది దృష్టికి తీసుకెళ్లారు. అయితే సమాచారమిచ్చి 45 నిమిషాలు గడుస్తున్నా, వారి నుంచి ఎలాంటి స్పందనా లేదు. అక్కడి వైద్య సిబ్బంది ఎవరూ పట్టించుకోలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబసభ్యులు ఆమెను దగ్గరిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్య సిబ్బంది తక్షణం స్పందించింది. వెంటనే చికిత్స చేయడంతో ఆమె పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. నిలోఫర్‌లోనే ఉంచితే ఆమె పరిస్థితి ఏమయ్యేదని కుటుంబ సభ్యులు వాపోతున్నారు.రోగులకు చుక్కలు చూపిస్తున్న వైద్యులు ఈ తరహాలోనే తాజాగా నిమ్స్ ఆస్పత్రిలోని అత్యవసర విభాగంలో చేరిన ఓ రోగికి సేవలందించడంలో ఆలస్యం చేశారు. దీంతో రోగి కుటుంబసభ్యులు వైద్యులను నిలదీశారు. అది వివాదంగా మారి చివరకు పోలీసుల కేసు వరకు వెళ్లింది. గాంధీ, ఉస్మానియా, నిలోఫర్, పేట్లబుర్జు తరతర ఆస్పత్రుల్లో అర్ధరాత్రి సమయాల్లో వైద్య సేవలు అవసరమైతే రోగులకు చుక్కలు కనిపిస్తున్నాయి. సరైన సమయానికి చికిత్స అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు గత కొంతకాలంగా వినిపిస్తున్నాయి.అందుబాటులో ఉండని సీనియర్ వైద్యులు సాధారణంగా రాత్రి వేళలో సీనియర్ వైద్యుల పర్యవేక్షణలో సేవలందించాల్సి ఉంటుంది. అయితే పలు ప్రభుత్వ ఆస్పత్రుల్లో జీనియర్లపైనే ఈ భారం పడుతోంది. సీనియర్ వైద్యులు జూనియర్లకు ఈ బాధ్యతలప్పగించి చేతులు దులుపుకుంటున్నారు. ఈ కారణంగా పీజీలు, రెసిడెంట్ వైద్యులపై ఈ పని భారం పడుతోంది. ఈ నేపథ్యంలోనే కొన్నిసార్లు వైద్య సేవల్లో ఏమాత్రం జాప్యం జరిగినా రోగుల కుటుంబీకులు వైద్య సిబ్బందితో వాగ్వా దాలకు దిగుతున్నారు.ఈ నేపథ్యంలోనే పలు ఆస్పత్రుల్లో గొడవలు జరుగుతున్నా యి. ఇలాంటి సమయాల్లో సీనియర్ వైద్యులు అందుబాటులో ఉంటే సర్దుబా టు చేసే వీలుంటుంది. ఓ వైపు పని ఒత్తిడి, మరోవైపు ఈ తరహా గొడవల కారణంగా విధుల్లో ఉన్న పీజీలు, రెసిడెంట్లు అవస్థలు పడుతున్నారు. ఈ ప్రభావం రోగుల సేవలపై పడుతోంది. ఆస్పత్రుల్లో రోగులకు అందుతున్న సేవలు, సిబ్బంది, వైద్యుల విధులను పర్యవేక్షిం చాల్సిన ఆర్ఎంవోలు చాలా మంది సమర్థంగా పని చేయడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ప్రధానంగా రాత్రి పూట అత్యవసర విభాగాలు, వార్డులలో పర్యటించి ఆయా ప్రాంతాల్లో ఎలాంటి సమస్యలు ఉన్నాయి అనే సమాచారాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాల్సి ఉంటుంది. ఆపై వారు తగిన చర్యలు తీసుకొని పరిష్కరిస్తారు. అయితే కొందరు రాత్రి 10 గంటలు దాటితే వారి గదుల నుంచి బయటకు రావడం లేదనే విమర్శలూ ఉన్నాయి.చిన్న చిన్న కారణాలతో ప్రాణాలు పోతున్నా

హైదరాబాద్‌లోని పెద్దాసుపత్రులకు రాత్రి సమయాల్లో దాదాపుగా 20 నుంచి 30 వరకు అత్యవసర కేసులు వస్తుంటాయి. రాజధానికి చుట్టుపక్కల జరిగే ప్రమాదాలు, నలువైపుల ఉన్న జిల్లాల నుంచి ఎమర్జెన్సీ కేసులు ఈ ఆస్పత్రులకు రిఫర్ చేస్తుంటారు. ఇలాంటి కేసుల్లో గోల్డెన్ అవర్ (తొలి గంట)లోనే చికిత్సలు అందించాల్సి ఉంటుంది. సేవల్లో జాప్యం, వెంటిలేటర్లు లేకపోవడం వంటి చిన్న చిన్న కారణాల వల్ల కొన్నిసార్లు అంబులెన్సులోనే రోగులు ప్రాణాలు విడుస్తున్న సందర్భాలు అనేకం ఉన్నాయి.

RNI NO.TGTEL/25/A5224
జోర్దార్
JORDAR TELUGU DAILY తెలుగు దినపత్రిక
అవినీతి అంతం - మా పంతం



# న్యూజిలాండ్ టూర్‌కు టీమిండియా కెప్టెన్ ఛేంజ్.. గిల్ స్థానంలో శ్రేయస్.



వచ్చే అక్టోబర్ అలాగే నవంబర్ నెలలలో భారత క్రికెట్ జట్టు న్యూజిలాండ్ దేశంలో పర్యటించనుంది. ఈ పర్యటనలో భాగంగా ఐదు టీ20లు, ఐదు వన్డేలు అలాగే రెండు టెస్ట్ మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. అయితే ఈ టూర్ షెడ్యూల్ చాలా టైట్?గా ఉండటంతో టీమిండియా మేనేజ్‌మెంట్‌కు పెద్ద తలనొప్పిగా మారింది. ముఖ్యంగా వన్డే సిరీస్ ముగిసిన వెంటనే కేవలం మూడు రోజుల వ్యవధిలోనే టెస్ట్ సిరీస్ ప్రారంభం కానుండటం ఆటగాళ్లపై తీవ్రమైన భారాన్ని మోపుతోంది. ఈ బిజీ క్యాలెండర్ కారణంగా జట్టు కూర్పులో మార్పులు చేయాల్సిన అనివార్య పరిస్థితి ఏర్పడింది. గిల్ స్థానంలో పగ్గాలు అందుకోనున్న శ్రేయస్వన్డే సిరీస్ చివరలో కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తోపాటు జస్‌ప్రీత్ బుమ్రా, కేఎల్ రాహుల్, మహమ్మద్ సిరాజ్ వంటి స్టార్ ఆటగాళ్లు సిరీస్‌ను మధ్యలోనే విడిచిపెట్టే అవకాశం ఉంది. టెస్ట్ మ్యాచ్‌లకు ముందు న్యూజిలాండ్ పిచ్‌లపై తగినంత ప్రాక్టీస్ చేయడానికి ఈ నిర్ణయం తీసుకోనున్నారు. ఇలాంటి పరిస్థితులలో చివరి రెండు వన్డే మ్యాచ్‌లకు వైస్ కెప్టెన్‌గా ఉన్న శ్రేయస్ అయ్యర్ జట్టుకు కెప్టెన్ గా వ్యవహరించనున్నాడు. యంగ్ ప్లేయర్లతో కూడిన ఈ కీలక మ్యాచ్‌లలో అయ్యర్ కెప్టెన్సీ సామర్థ్యానికి అసలు పరీక్ష ఎదురుకానుంది.

కోచింగ్ సిబ్బందిలో కూడా మార్పులుకేవలం ఆటగాళ్లు మాత్రమే కాకుండా భారత జట్టు కోచింగ్ సిబ్బంది కూడా రెండుగా విడిపోయే సూచనలు కనిపిస్తున్నాయి. హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ మూడో వన్డే ముగిసిన వెంటనే టెస్ట్ జట్టుతో కలిసి ప్రత్యేక శిక్షణకు వెళ్లనున్నారు. ఆయనతో పాటు కొద్దిమంది సహాయక కోచ్‌లు కూడా టెస్ట్ ప్రిపరేషన్ కోసం పయనం కానున్నారు. మిగిలిన కోచింగ్ స్టాఫ్ మాత్రం వన్డే సిరీస్ పూర్తిగా ముగిసే వరకు పరిమిత ఓవర్ల జట్టుతోనే కొనసాగనున్నారు. షెడ్యూల్ ఒత్తిడి కారణంగా మేనేజ్‌మెంట్ ఈ వినూత్న ప్రణాళికను అమలు చేయాలని భావిస్తోంది. టెస్ట్ సిరీస్ కోసం కఠిన సన్నాహాలభారత టెస్ట్ జట్టుకు తగిన సమయం దక్కాలనే ఉద్దేశంతోనే ఈ కఠిన నిర్ణయాలు తీసుకుంటున్నారు. కివీస్ గడ్డపై సవాల్‌తో కూడిన టెస్ట్ మ్యాచ్‌లలో రాణించాలంటే ముందుగా రెడ్ బాల్ క్రికెట్‌పై పూర్తి ఏకాగ్రత అవసరం. అందుకే కెప్టెన్ గిల్ స్వయంగా ముందే తగిన ప్రాక్టీస్ కోసం డిమాండ్ చేసినట్లు సమాచారం. ఈ మొత్తం పరిణామాలు రాబోయే సిరీస్‌ను మరింత రసవత్తరంగా మారుస్తున్నాయి.

# బంగారం కొనాలనుకునేవారికి అలర్ట్..

ప్రస్తుతం బంగారం, వెండి ధరలు దిగి వస్తున్నాయి. ఇటీవల భారీగా పెరుగుతూ వచ్చిన బంగారం ధరలు.. ప్రస్తుతం దిగి వస్తున్నాయి. పెరుగుతున్న ముడి చమురు ధరలు, ద్రవ్యోల్బణ ఆందోళనలు బంగారం ధరలపై ఒత్తిడిని పెంచుతున్నాయి. బంగారం, వెండి ధరలు హెచ్చుతగ్గులకు లోనవుతూనే ఉన్నాయి. ఈరోజు సెప్టెంబర్ 16న ఈ రెండు లోహాల ధరలు తగ్గాయి.మంగళవారం వీజీఆ ఎక్స్ఛేంజ్‌లో బంగారం, వెండి ధరలు తగ్గాయి. అక్టోబర్ 5, 2026 గడువు తేదీ గల గోల్డ్ ఫ్యూచర్స్, రూ.494 (0.33%) తగ్గి, 10 గ్రాములకు రూ.1,50,736 వద్ద ట్రేడ్ అయ్యాయి. ట్రేడింగ్ సమయంలో, బంగారం కనిష్టంగా రూ.1,50,650 మరియు గరిష్టంగా రూ.1,51,553 ను తాకింది.ఇదిలా ఉండగా, డిసెంబర్ 4, 2026 గడువు తేదీ గల సిల్వర్ ఫ్యూచర్స్, కిలోకు రూ. 2,31,202 వద్ద 0.64% లేదా రూ. 1,488 మేర తగ్గి ట్రేడవుతున్నాయి. బులియన్ మార్కెట్‌లో స్పష్టమైన అమ్మకాల ఒత్తిడి, సిల్వర్ ఇంట్రాడే శ్రేణి రూ. 2,30,816 , రూ. 2,32,546 మధ్య కొనసాగింది.తెలుగు రాష్ట్రాల్లో బంగారం ధరలు:ఈరోజు హైదరాబాద్‌లో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముకు రూ.153,160 ఉండగా, అదే 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,40,390, 18 క్యారెట్ల 10 గ్రాముల బంగారం రూ.1,14,870 వద్ద కొనసాగుతోంది.

విజయవాడలో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముకు రూ.153,160 ఉండగా, అదే 22



క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,40,390, 18 క్యారెట్ల 10 గ్రాముల బంగారం రూ.1,14,870 వద్ద కొనసాగుతోంది.ఇతర రాష్ట్రాల్లో..

ఢిల్లీలో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముకు రూ.153,310 ఉండగా, అదే 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,40,540, 18 క్యారెట్ల 10 గ్రాముల బంగారం రూ.1,15,020 వద్ద కొనసాగుతోంది.

ముంబైలో24 క్యారెట్ల బంగారం 10 గ్రాముకు రూ.153,160 ఉండగా, అదే 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,40,390, 18 క్యారెట్ల 10 గ్రాముల బంగారం రూ.1,14,870 వద్ద కొనసాగుతోంది.

బెంగళూరులో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముకు రూ.153,160 ఉండగా, అదే 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,40,390, 18 క్యారెట్ల 10 గ్రాముల బంగారం రూ.1,14,870 వద్ద కొనసాగుతోంది.కోల్‌కతాలో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముకు రూ.153,160 ఉండగా, అదే 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,40,390, 18 క్యారెట్ల 10 గ్రాముల బంగారం రూ.1,14,870 వద్ద కొనసాగుతోంది.చెన్నైలో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముకు రూ.153,160 ఉండగా, అదే 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,40,390, 18 క్యారెట్ల 10 గ్రాముల బంగారం రూ.1,18,090 వద్ద కొనసాగుతోంది.

ఇక వెండి విషయానికొస్తే..రూ.2,44,900 వద్ద ట్రేడవుతోంది.

# జపాన్‌తో తలపడే టీమిండియా ప్లేయింగ్ 11 ఇదే.



టీమిండియా జపాన్ పర్యటనకు చేరుకుంది. అక్కడ ఆసియా క్రీడలకు ముందు జపాన్‌తో ఏకైక టీ20 మ్యాచ్ ఆడనుంది. ఈ మ్యాచ్ కేవలం ఒక వార్మప్ మ్యాచ్‌గానే కాకుండా, అంతర్జాతీయ క్రికెట్ చరిత్రలో భారత్, జపాన్ జట్లు తొలిసారి తలపడనున్నాయి కాబట్టి దీనికి ప్రత్యేక ప్రాముఖ్యత ఉంది. ఈ ఏకైక టీ20 మ్యాచ్‌ను సుజుకి కప్ పేరుతో నిర్వహిస్తున్నారు. టీమిండియా నిన్న జపాన్‌కు చేరుకుంది. ఈరోజు తోచిగి ప్రీఫిక్చర్ లోని సానో ఇంటర్నేషనల్ క్రికెట్ గ్రౌండ్‌లో తొలి ప్రాక్టీస్ సెషన్ జరగనుంది. రేపు మంగళవారం ఈ మ్యాచ్ భారత ప్రకారం ఉదయం 9:30 గంటలకు ప్రారంభమవుతుంది.ఈ మ్యాచ్ తర్వాత, ఆగస్టు 24 నుంచి ఆసియా గేమ్స్‌లో పురుషుల క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం కానుంది. అందువల్ల, జపాన్‌తో జరిగే ఈ టీ20 మ్యాచ్ భారత్ వర్సెస్ జపాన్ ఇరు జట్లకు ఆసియా క్రీడలకు ముందు ఒక విలువైన అవకాశంగా ఉపయోగపడనుంది.టీమిండియా ప్లేయింగ్ 11లో యువ ఆటగాళ్లకు ప్రాధాన్యత..జపాన్‌తో జరిగే ఏకైక టీ20 మ్యాచ్ కోసం టీమిండియా ప్లేయింగ్ 11 ఎలా ఉండబోతుందనేది ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది. అంచనా ప్రకారం, సీనియర్ ఆటగాళ్లకు విశ్రాంతినిచ్చి యువ ఆటగాళ్లకు తుది జట్టులో అవకాశం కల్పించే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. వైభవ్ సూర్యవంశీ, సంజు శాంసన్‌లు ఓపెనర్లుగా బరిలోకి దిగే అవకాశాలున్నాయి. జస్ప్రీత్ బుమ్రా, అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్‌లకు ఈ మ్యాచ్‌లో విశ్రాంతినివ్వనున్నట్లు తెలుస్తోంది.బ్యాటింగ్ ఆర్డర్‌లో, ఫస్ట్ డౌన్ లో కెప్టెన్‌గా శ్రేయస్ అయ్యర్ నాయకత్వం వహించనున్నాడు. ఆ తర్వాత తిలక్ వర్మ బ్యాటింగ్ చేసే అవకాశం ఉంది. జట్టు కూర్పులో నలుగురు ఆల్ రౌండర్లను బరిలోకి దింపే అవకాశాలు కనిపిస్తున్నాయి. శివమ్ దూబే, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, విప్రజ్ నిగమ్ ఆల్ రౌండర్ల కోటాలో ప్లేయింగ్ 11లోకి ఎంపికయ్యే అవకాశాలున్నాయి. ఫాస్ట్ బౌలర్లుగా అర్షదీప్ సింగ్, ఎస్. ఠాకూర్ లకు తుది జట్టులో అవకాశం రానుంది. స్పిన్ బాధ్యతలు రవి బిష్ణోయ్ చూసుకునే అవకాశం ఉంది.మొత్తంమీద, ఈ ఏకైక టీ20 కోసం సంజు శాంసన్, వైభవ్ సూర్యవంశీ, శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), తిలక్ వర్మ, శివమ్ దూబే, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, విప్రజ్ నిగమ్, రవి బిష్ణోయ్, ఎస్. ఠాకూర్, అర్షదీప్ సింగ్‌లతో కూడిన ప్లేయింగ్ 11 బరిలోకి దిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.వీవీఎస్ లక్ష్మణ్ పర్యవేక్షణలో జట్టు..ఈ జపాన్ పర్యటన, ఆసియా గేమ్స్‌లో టీమిండియా వీవీఎస్ లక్ష్మణ్ పర్యవేక్షణలో ఆడనుంది. గౌతమ్ గంభీర్ కాకుండా లక్ష్మణ్ కోచ్‌గా వ్యవహరించడం విశేషం. ఈ ప్లేయింగ్ 11 కేవలం జపాన్‌తో జరిగే ఏకైక టీ20 మ్యాచ్ కోసమే రూపొందించబడింది. ఆ తర్వాత జరిగే ఆసియా గేమ్స్‌లో భారత జట్టు మెయిన్ స్క్వాడ్‌తో బరిలోకి దిగనుంది. ఈ మ్యాచ్ ద్వారా యువ ఆటగాళ్లు తమ సత్తాను నిరూపించుకోవడానికి అద్భుతమైన అవకాశం లభించనుంది.

# 20 ఏళ్ల పెట్టుబడి ప్రణాళిక.. దేనికి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలి..?

భవిష్యత్తు కోసం పెట్టుబడులు పెట్టడం అంటే ప్రతి నెల కొంత మొత్తాన్ని సేవింగ్స్‌లోకి మళ్లించడం మాత్రమే కాదు. ఏ లక్ష్యం కోసం ఎంత డబ్బు అవసరం? ఆ డబ్బు ఎప్పుడు అవసరం? అందుకోసం ఇప్పటి నుంచి ఎంత పెట్టుబడి చేయాలి? అనే విషయాలను ముందుగానే ప్రణాళిక సిద్ధం చేసుకోవడం చాలా ముఖ్యం. 20 ఏళ్ల వంటి దీర్ఘకాలిక ప్రణాళికలో ఈ విధానం మరింత ఉపయోగకరంగా ఉంటుంది. రాబోయే 20 ఏళ్లలో ఎదురయ్యే ప్రధాన ఆర్థిక అవసరాలను ముందుగా రాసుకోవాలి.

భారీ లక్ష్యాలకు ప్రాధాన్యత

20 ఏళ్లకు రూపొందించే పెట్టుబడి ప్రణాళికలో.. ముందుగా భారీ లక్ష్యాలకు ప్రాధాన్యత ఇవ్వాలి. ఇల్లు కొనడం, పిల్లల ఉన్నత విద్య, పిల్లల వివాహం, రిటైర్మెంట్ వంటి భారీ లక్ష్యాలను ఇందులో చేర్చాలి. ప్రతి లక్ష్యానికి ఒక నిర్దిష్ట మొత్తాన్ని, దాన్ని సాధించాల్సిన తేదీని నిర్ణయించుకోవాలి.

అన్ని లక్ష్యాల కోసం ఒకే పెట్టుబడి బకెట్‌ను ఉపయోగించడం కంటే ఒక్కో లక్ష్యానికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించడం మంచిది.

సాధారణంగా ఏడాదిలోపు అవసరమయ్యే లక్ష్యాలను స్వల్పకాలికంగా, 1--8 ఏళ్ల మధ్య లక్ష్యాలను మధ్యకాలికంగా, 8 ఏళ్లు లేదా అంతకంటే ఎక్కువ సమయం ఉన్న లక్ష్యాలను దీర్ఘకాలికంగా పరిగణించవచ్చు.

ద్రవ్యోల్బణాన్ని మర్చిపోవద్దు

ఈ రోజు ఒక లక్ష్యానికి అవసరమయ్యే మొత్తం, 10 లేదా 15 ఏళ్ల తర్వాత అదే మొత్తంగా ఉండకపోవచ్చు. విద్య, ఇల్లు, వైద్యం వంటి



ఖర్చులు కాలక్రమంలో పెరిగే అవకాశం ఉంటుంది. అందువల్ల భవిష్యత్ లక్ష్యాన్ని లెక్కించేటప్పుడు ద్రవ్యోల్బణాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలి.

తక్కువ కాలంలో అవసరమయ్యే డబ్బుకు స్థిరత్వం, లిక్విడిటీకి ప్రాధాన్యత ఇవ్వాలి. మరోవైపు 15--20 ఏళ్ల తర్వాత అవసరమయ్యే డబ్బుకు మార్కెట్ హెచ్చుతగ్గులను తట్టుకునేంత సమయం ఉంటుంది. కాబట్టి పెట్టుబడి ఎంపికలో లక్ష్య కాలవ్యవధి, రిస్క్ తీసుకునే సామర్థ్యం, వ్యక్తిగత పరిస్థితులను పరిగణనలోకి తీసుకోవాలి. వివిధ ఆస్తి వర్గాల్లో పెట్టుబడులు విభజించడం ద్వారా రిస్క్‌ను కొంత మేర తగ్గించుకోవచ్చు, అయితే నష్టాల అవకాశాన్ని పూర్తిగా తొలగించలేం.

రిటైర్మెంట్‌కు ప్రత్యేక స్థానం

ఇల్లు, పిల్లల చదువు వంటి సమీప లక్ష్యాల మధ్య రిటైర్మెంట్ కోసం పెట్టుబడిని వాయిదా వేయకూడదు. 20 ఏళ్ల ఆర్థిక ప్రణాళికలో రిటైర్మెంట్ లక్ష్యానికి ముందుగానే స్థానం కల్పించాలి. దీర్ఘకాలిక రిటైర్మెంట్ పొదుపు కోసం కూడా ఒక ఎంపికగా పరిగణించవచ్చు.

ప్రతి ఏడాది ప్రణాళికను సమీక్షించాలి

పెట్టుబడి ఎంత రాబడి ఇచ్చిందనే దానికంటే, అది నిర్దేశించిన ఆర్థిక లక్ష్యానికి చేరువ చేస్తుందా లేదా అనేది ముఖ్యం. కనీసం ఏడాదికి ఒకసారి ప్రణాళికను సమీక్షించాలి. ఆదాయం, ఖర్చులు, కుటుంబ పరిస్థితులు లేదా ఉద్యోగంలో మార్పులు వచ్చినప్పుడు కూడా పెట్టుబడి ప్రణాళికను సవరించాలి.

ఆదాయం పెరిగినప్పుడు పెట్టుబడినీ పెంచాలి

20 ఏళ్ల ప్రణాళికను ప్రారంభించిన మొత్తంతోనే కొనసాగించాల్సిన అవసరం లేదు. ఆదాయం పెరిగే కొద్దీ పెట్టుబడిని కూడా

# 47 ఏళ్ల వయసులోనూ తగ్గేదేలే.. సీపీఎల్ 2026లో అత్యధిక వికెట్లు తీసి రికార్డ్

: కరీబియన్ ప్రీమియర్ లీగ్ 2026 టోర్నమెంట్ ఇప్పుడు అత్యంత రసవత్తరమైన తుది దశకు చేరుకుంది. భారత కాలమానం ప్రకారం సోమవారం సెప్టెంబర్ 21వ తేదీన ఉదయం నాలుగున్నర గంటలకు సీపీఎల్ ఫైనల్ మ్యాచ్ ప్రారంభం కానుంది. ఈసారి జరిగే పోరులో యాంటిగ్వా అండ్ బార్బుడా ఫాల్కన్స్ అలాగే జమైకా కింగ్స్‌మన్ జట్లు తలపడనున్నాయి. ఈ టోర్నమెంట్‌లో ఎన్నో ఆసక్తికరమైన సంఘటనలు చోటుచేసుకోగా, బౌలర్ల విభాగంలో ఒక సీనియర్ ఆటగాడు ప్రదర్శించిన అద్భుతమైన ప్రతిభ అందరి దృష్టిని విపరీతంగా ఆకర్షిస్తోంది.పాకిస్థాన్‌లోని లాహోర్‌లో జన్మించిన ఇమ్రాన్ తాహిర్ దక్షిణాఫ్రికా తరపున అంతర్జాతీయ క్రికెట్‌లో అనేక అద్భుతాలు సృష్టించారు. ఐపీఎల్‌లో చెన్నై సూపర్ కింగ్స్ జట్టు తరపున ఎంఎస్ ధోనీతో కలిసి 27 మ్యాచ్‌లు ఆడిన ఆయన, ఇప్పుడు తన 47 ఏళ్ల వయసులోనూ అదరగొడుతున్నారు. సీపీఎల్ 2026 టోర్నమెంట్‌లో ఆడిన 12 మ్యాచ్‌లలో అద్భుతమైన బౌలింగ్ ప్రదర్శన కనబరిచి మొత్తం 16 వికెట్లు పడగొట్టారు. తన అద్భుతమైన ఎకానమీ రేట్ కారణంగా ఆయన ప్రస్తుతం వికెట్ల తీతలో మొదటి స్థానంలో నిలిచి అందరినీ ఆశ్చర్యపరిచారు.అయితే ఇమ్రాన్ తాహిర్ సారథ్యం వహించిన గయానా అమెజాన్ వారియర్స్ జట్టు రెండో క్వాలిఫైయర్




మ్యాచ్‌లో ఓడిపోయి టోర్నమెంట్ నుంచి వెనుదిరిగింది. తాహిర్‌తో పాటు హుస్నైన్ షా అలాగే మాథ్యూ ఫోర్డ్ కూడా సమానంగా 16-16 వికెట్లు పడగొట్టినప్పటికీ, మెరుగైన ఎకానమీ రేట్ కారణంగా తాహిర్ అగ్రస్థానంలో కొనసాగుతున్నారు. ఫైనల్ మ్యాచ్ ఆడనున్న జమైకా ఆటగాడికి తాహిర్ రికార్డ్‌ను అధిగమించే అవకాశం ఉంది. ఇక బ్యాటింగ్ విభాగంలో క్వింటన్ డికాక్ అత్యధికంగా 392 పరుగులు సాధించి టాప్ స్కోరర్‌గా నిలిచారు.యువ ఆటగాళ్లకు సైతం తీసిపోని విధంగా మైదానంలో పరుగెడుతూ వికెట్లు పడగొట్టాక సంబరాలు చేసుకునే తాహిర్ శైలి అందరినీ అలరిస్తోంది. ఫిట్‌నెస్ విషయంలో ఆయన చూపుతున్న శ్రద్ధ నేటి యువతకు ఒక చక్కటి స్ఫూర్తిని ఇస్తోంది. సుదీర్ఘకాలం పాటు క్రికెట్ ఆడిన అనుభవాన్ని రంగరించి క్లిష్ట సమయాల్లో జట్టుకు విజయాలు అందించడంలో తాహిర్ ఎప్పుడూ ముందుంటారు. ఈ టోర్నమెంట్‌లో ఆయన సాధించిన ఈ ఘనత ఆయన కెరీర్‌లో మరో మైలురాయిగా నిలిచింది.

# కొండెక్కిన చికెన్, కోడి గుడ్ల ధరలు.. సామాన్యులకు మరో షాక్.. తెలుగు రాష్ట్రాల్లో కిలో చికెన్ ఎంతంటే..

నాన్ వెజ్ తినేవారికి బ్యాడ్ న్యూస్. చికెన్ ధరలు కొండెక్కుతున్నాయి. గత కొద్ది రోజుల క్రితం కిలో చికెన్ రూ.230కే లభించగా.. ఇప్పుడు మళ్లీ ఆకాశాన్నంటుతున్నాయి. ఆది వారం కావడంతో చికెన్ తినేందుకు ఎక్కువ ఆసక్తి చూపిస్తుంటారు. అయితే పెరిగిన ధరలు సామాన్యులపై భారం పెంచుతోంది. శ్రావణం మాసం పూర్తయిన దగ్గర నుంచి ధరలు కొద్దికొద్దిగా పెరుగుతూ వస్తోన్నాయి. త్వరలో పండుగలు రానున్న క్రమంలో మళ్లీ పుంజుకుంటున్నాయి. రానున్న రోజుల్లో మరింత పెరిగే అవకాశముందని వ్యాపారులు చెబుతున్నారు. దసరా, దీపావళి వంటి పండగలు రానుండటమే ఇందుకు కారణంగా చెబుతున్నారు. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల్లో ధరలు ఎలా ఉన్నాయనేది చూద్దాం.తెలుగు రాష్ట్రాల్లో కిలో చికెన్ ఎంతంటే..?-హైదరాబాద్‌లో కిలో స్కిన్ లెస్ చికెన్ రూ.252 పలుకుతుండగా.. డ్రస్స్‌డ్ చికెన్ రూ.223, రిటైల్ లైవ్ బర్డ్ రూ.144, ఎక్స్ ఫారం లైవ్ బర్డ్ రూ.117కు లభిస్తున్నాయి.-కరీంనగర్ జోన్‌లో కేజీ స్కిన్‌లెస్ చికెన్ రూ.252, డ్రస్స్‌డ్ స్కిన్ రూ.223, రిటైల్ లైవ్ బర్డ్ రూ.144, ఫారం దగ్గర లైవ్ బర్డ్ రూ.117 పలుకుతున్నాయి.

-విజయవాడ జోన్‌లో కిలో స్కిన్ లెస్ చికెన్ రూ.266, డ్రస్స్‌డ్ చికెన్ రూ.236, ఫారం



దగ్గర లైవ్ బర్డ్ రూ.125, రిటైల్ లైవ్ బర్డ్ రూ.152 వద్ద కొసాగుతున్నాయి.

పెరిగినకోడి గ్రుడ్ల ధరలు

సామాన్యుడికి అందుబాటులో ఉండే కోడిగ్రుడ్ల ధరలు కూడా భారీగా పెరిగాయి. చికెన్ ధరలతో పాటు వీటి ధరలు కూడా ఎగబాకాయి. విజయవాడలో 12 గ్రుడ్ల రిటైల్ ధర రూ.80గా ఉంది. హైదరాబాద్ జోన్‌లో 12 గ్రుడ్ల రిటైల్ ధర రూ.76గా ఉంది. మొన్నటివరకు 12 గ్రుడ్ల ధర రూ.70గా ఉండగా.. ఇప్పుడు మరింతగా పెరిగాయి. చికెన్, గ్రుడ్ల ధరలు రెండూ పెరగడం సామాన్యులకు షాక్‌గా చెప్పవచ్చు. మొన్నటివరకు కిలో చికెన్ రూ.230 వద్ద ఉండగా.. ఇప్పుడు రూ.250 నుంచి రూ.270 వద్ద పలుకుతున్నాయి. పండుగల సీజన్ రానున్న క్రమంలో ధరలు మరితం ఎగబాకనున్నాయని చెప్పవచ్చు. పౌల్ట్రీ ఉత్పత్తి, సరఫరా వ్యత్యాసాల కారణంగా వ్యాపారులు ధరలను పెంచారు. ఇప్పటికే నిత్యావసర సరుకులు, కూరగాయల ధరలు పెరిగాయి. షుగర్, వంట నూనె, గ్యాస్ ధరలు పెరిగాయి. దీంతో పాటు గత కొంతకాలంగా ఉల్లి ఘాటెక్కిస్తోంది. కిలో ఉల్లి రూ.70 పలుకుతోంది. పాల ధరలు కూడా ఇటీవల పెరిగాయి. ఎల్‌నీనో ప్రభావంతో వర్షాలు లేకపోవడంతో పంట సాగు తగ్గింది. ధరలు పెరగడానికి ఇదే కారణమవుతోంది.

RNI NO.TGTEL/25/A5224
జోర్దార్
JORDAR TELUGU DAILY తెలుగు దినపత్రిక
అవినీతి అంతం - మా పంతం





## యాక్షన్ సీన్స్‌తో దుమ్మురేపిన రష్మిక మందన్న.. మెంటలెక్కిస్తున్న మైసా టీజర్

నేషనల్ క్రష్ రష్మిక మందన్న ప్రస్తుతం వరుస సినిమాలతో దూసుకుపోతున్నారు. కమర్షియల్ చిత్రాలతో పాటు విభిన్నమైన కథలను ఎంచుకుంటూ తనలోని నటనను మరో కోణంలో ఆవిష్కరిస్తున్నారు. ఈ క్రమంలో ఆమె ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం 'మైసా'. రవీంద్ర పుల్లె దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ యాక్షన్ థ్రిల్లర్‌పై ఇప్పటికే ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. దాదాపు షూటింగ్‌ను పూర్తి చేసుకున్న ఈ చిత్రం నవంబర్ 27న ప్రేక్షకుల ముందుకు రానుంది. సినిమా విడుదలకు సమయం దగ్గరపడుతున్న నేపథ్యంలో చిత్రబృందం తాజాగా టీజర్‌ను విడుదల చేసింది. ఈ టీజర్ సినిమాపై అంచనాలను భారీగా పెంచేసింది.ఏం పాటరా బాబు..! యూట్యూబ్‌ను షేక్ చేస్తున్న సాంగ్.. విన్నకొద్దీ వినాలనిపించేలా ఉందిగామైసాలో రష్మిక ఇంతకుముందెన్నడూ కనిపించని రీతిలో సరికొత్త అవతారంలో దర్శనమిచ్చారు. గిరిజన గోండు మహిళ పాత్రలో ఆమె పవర్‌ఫుల్ పెర్ఫార్మెన్స్‌తో ఆకట్టుకునేలా కనిపించారు. కేవలం గ్లామర్‌కే పరిమితం కాకుండా, యాక్షన్ సన్నివేశాల్లోనూ తనదైన శైలిలో మెప్పించనున్నట్లు టీజర్ చూస్తే అర్థమవుతోంది. తన తండ్రి కోసం, తన వాళ్ల కోసం పోరాడే మహిళగా రష్మిక పాత్రను తీర్చిదిద్దినట్లు టీజర్ ద్వారా తెలుస్తోంది. కష్టకాలంలో తన ప్రజల కోసం ఆమె చేసే పోరాటమే కథలో కీలకాంశంగా ఉండబోతున్నట్లు కనిపిస్తోంది.తెలుగు సినిమా దెబ్బకు కన్నీళ్లు పెట్టుకుంటున్న నార్త్ ఆడియన్స్.. ఓటీటీలో దూసుకుపోతున్న మూవీటీజర్ ఆద్యంతం యాక్షన్ సన్నివేశాలతో నిండిపోయింది. అడవులు, గిరిజన ప్రాంతాల నేపథ్యంలో సాగే కథకు తగ్గట్టుగా విజువల్స్‌ను తెరకెక్కించిన తీరు ఆకట్టుకుంటోంది. రష్మిక పాత్రలోని మాస్ షేడ్స్, యాక్షన్ సీన్స్ సినిమాపై అంచనాలను మరింత పెంచుతున్నాయి. ఇక టీజర్‌లో జేక్స్ బిజోయ్ అందించిన నేపథ్య సంగీతం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. యాక్షన్ సన్నివేశాలకు తగ్గట్టుగా ఆయన అందించిన మ్యూజిక్ టీజర్‌కు మరింత ఇంపాక్ట్ తీసుకొచ్చింది. సినిమాటోగ్రఫీ, విజువల్స్ కూడా కథకు తగ్గట్టుగా కనిపిస్తున్నాయి. కొత్త తరహా యాక్షన్ థ్రిల్లర్‌గా 'మైసా' విభిన్నమైన కథాంశంతో తెరకెక్కుతున్న 'మైసా'లో ర్తోంది. కష్టకాలంలో తన ప్రజల కోసం ఆమె చేసే పోరాటమే కథలో కీలకాంశంగా ఉండబోతున్నట్లు కనిపిస్తోంది.తెలుగు సినిమా దెబ్బకు కన్నీళ్లు పెట్టుకుంటున్న నార్త్ ఆడియన్స్.. ఓటీటీలో దూసుకుపోతున్న మూవీటీజర్ ఆద్యంతం యాక్షన్ సన్నివేశాలతో నిండిపోయింది. అడవులు, గిరిజన ప్రాంతాల నేపథ్యంలో సాగే కథకు తగ్గట్టుగా విజువల్స్‌ను తెరకెక్కించిన తీరు ఆకట్టుకుంటోంది. రష్మిక పాత్రలోని మాస్ షేడ్స్, యాక్షన్ సీన్స్ సినిమాపై అంచనాలను మరింత పెంచుతున్నాయి. ఇక టీజర్‌లో జేక్స్ బిజోయ్ అందించిన నేపథ్య సంగీతరష్మిక పాత్ర ఎలా ఉండబోతుందనే ఆసక్తి ప్రేక్షకుల్లో నెలకొంది. టీజర్‌తో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. రష్మిక కెరీర్‌లో మరో డిఫరెంట్ మూవీగా 'మైసా' నిలుస్తుందా? గిరిజన మహిళగా ఆమె పాత్ర ప్రేక్షకులను ఎంతవరకు ఆకట్టుకుంటుందో తెలియాలంటే నవంబర్ 27 వరకు వేచి చూడాల్సిందే.

తెలుగు ప్రేక్షకులకు 'మేం వయసుకు వచ్చాం' సినిమాతో పరిచయమైన నటి నీతి టేలర్ ప్రత్యేక పరిచయం అవసరం లేని పేరు. ఈ సినిమాలో ఆమె తన అందం, అభినయంతో ఆకట్టుకుంది. తెలుగులో ఆమె సినిమాల సంఖ్య తక్కువే అయినప్పటికీ.. నటిగా మంచి గుర్తింపును సొంతం చేసుకుంది. ఆ తర్వాత హిందీ టెలివిజన్‌లో వరుస అవకాశాలు అందుకుంటూ బుల్లితెరపై తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపును సంపాదించుకుంది. సీరియల్స్‌తో పాటు రియాలిటీ షోలు, మ్యూజిక్ వీడియోల్లోనూ సందడి చేసిన నీతి టేలర్.. 2020లో ఇండియన్ ఆర్మీ అధికారి పరిక్షిత్ బవాతో వివాహ బంధంలోకి అడుగుపెట్టింది.అయితే కొంతకాలంగా ఈ దంపతుల మధ్య విభేదాలు వచ్చాయని, ఇద్దరూ విడాకులు తీసుకోబోతున్నారంటూ సోషల్ మీడియాలో పలు కథనాలు వైరల్ అయ్యాయి. తన వైవాహిక జీవితంపై వస్తున్న వార్తలకు తాజాగా నీతి టేలర్ స్పందించినట్లు తెలుస్తోంది.సోషల్ మీడియాలో ఏదైనా వార్త వైరల్ అయినంత మాత్రాన దాని గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆమె పేర్కొంది. నిజం కాని విషయాలు తమను పెద్దగా ప్రభావితం చేయవని స్పష్టం చేసింది. తమ బంధం గురించి తమకు పూర్తిగా తెలుసని, తమ జీవితానికి సంబంధించిన నిర్ణయాలను తామే ఇష్టపూర్వకంగా తీసుకున్నామని తెలిపింది. ప్రస్తుతం తామిద్దరం సంతోషంగా, క్షేమంగా వైవాహిక జీవితాన్ని కొనసాగిస్తున్నామని చెప్పింది.అయితే కొంతకాలంగా ఈ దంపతుల మధ్య విభేదాలు వచ్చాయని, ఇద్దరూ విడాకులు తీసుకోబోతున్నారంటూ సోషల్ మీడియాలో పలు కథనాలు వైరల్ అయ్యాయి. తన వైవాహిక జీవితంపై వస్తున్న వార్తలకు తాజాగా నీతి టేలర్ స్పందించినట్లు తెలుస్తోంది.సోషల్ మీడియాలో ఏదైనా వార్త వైరల్ అయినంత మాత్రాన దాని గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆమె పేర్కొంది. నిజం కాని విషయాలు తమను పెద్దగా ప్రభావితం చేయవని స్పష్టం చేసింది. తమ బంధం గురించి తమకు పూర్తిగా తెలుసని, తమ జీవితానికి సంబంధించిన నిర్ణయాలను తామే ఇష్టపూర్వకంగా తీసుకున్నామని తెలిపింది. ప్రస్తుతం తామిద్దరం సంతోషంగా, క్షేమంగా వైవాహిక జీవితాన్ని కొనసాగిస్తున్నామని చెప్పింది.తమ దాంపత్య జీవితంపై ఇలాంటి పుకార్లు, విమర్శలు చేయకుండా ఉండాలని, తమ సంతోషకరమైన జీవితానికి ఎవరూ దిష్టి పెట్టకూడదని కోరుకున్నట్లు వెల్లడించింది. దీంతో తన భర్తతో విడాకులు తీసుకోబోతున్నారంటూ వస్తున్న ప్రచారానికి నీతి టేలర్ తనదైన శైలిలో స్పష్టత ఇచ్చినట్లైంది. నీతి టేలర్ గతంలో ఓటీటీ రియాలిటీ షో అలయన్స్ లో పాల్గొన్న సమయంలో తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన కొన్ని విషయాలను వెల్లడించింది. మాజీ బాయ్‌ఫ్రెండ్ తనను సిగరెట్‌తో కాల్చి గాయపరిచాడని, హింసాత్మకంగా ప్రవర్తించడంతో పాటు మానసికంగా కూడా తనను ఎంతో ఇబ్బంది పెట్టాడని తెలిపింది.

## విడాకులపై క్లారిటీ ఇచ్చిన మేం వయసుకు వచ్చాం హీరోయిన్.





## ది ప్యారడైజ్ సినిమాకు తెలంగాణ సర్కార్ గుడ్ న్యూస్..

నేచురల్ స్టార్ నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న ది ప్యారడైజ్ సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమా విడుదలకు ముందే తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మూవీకి ప్రత్యేక ప్రీమియర్ షో నిర్వహించడంతో పాటు, టికెట్ ధరల పెంపునకు ప్రభుత్వం అనుమతి మంజూరు చేసింది. 'ది ప్యారడైజ్' సినిమాకు సెప్టెంబర్ 23న సాయంత్రం 6:30 గంటలకు ప్రత్యేక ప్రీమియర్ షో నిర్వహించేందుకు అనుమతి లభించింది. ఈ స్పెషల్ షోకు టికెట్ ధరను రూ.500గా నిర్ణయించారు. ఇందులో జీఎస్టీ కూడా కలిపి ఉంటుంది. సినిమా విడుదల రోజు నుంచి సెప్టెంబర్ 27 వరకు టికెట్ ధరలను పెంచుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం అనుమతించింది. ఈ కాలంలో మల్టీప్లెక్స్‌లలో ఒక్కో టికెట్‌పై రూ.94, జీఎస్టీతో కలిపి పెంపునకు అనుమతి ఇచ్చారు. సింగిల్ స్క్రీన్ థియేటర్లలో టికెట్ ధరపై రూ.48, జీఎస్టీతో కలిపి పెంచుకోవచ్చు.అలాగే సెప్టెంబర్ 28 నుంచి అక్టోబర్ 3 వరకు కూడా టికెట్ ధరల పెంపునకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ కాలంలో మల్టీప్లెక్స్‌లలో టికెట్‌పై రూ.45, జీఎస్టీతో కలిపి అదనంగా వసూలు చేసుకునేందుకు, సింగిల్ స్క్రీన్ థియేటర్లలో రూ.23, జీఎస్టీతో కలిపి పెంచుకునేందుకు అనుమతి లభించింది. టికెట్ ధరల పెంపునకు అనుమతి ఇవ్వడంతో పాటు తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిబంధనను విధించింది.నిర్మాతలు తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు రూ.1 కోటి అందించాలని ప్రభుత్వం ఆదేశించినట్లు సమాచారం. దీంతో 'ది ప్యారడైజ్' విడుదల సందర్భంగా థియేటర్లలో టికెట్ ధరలు పెరగనున్నాయి. ప్రత్యేక ప్రీమియర్ షోకు కూడా అనుమతి రావడంతో సినిమా విడుదలపై ఆసక్తి మరింత పెరిగింది. దసరా లాంటి బ్లాక్ బస్టర్ హిట్ తర్వాత శ్రీకాంత్, నాని కాంబినేషన్ లో వస్తున్న సినిమా కావడంతో ఈ సినిమా పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమాతో నాని భారీ హిట్ కొట్టడం ఖాయం అంటున్నారు నాని అభిమానులు.

## పల్లెటూరి ప్రేమకథతో మెప్పించడానికి రెడీ.



చిన్నసినిమాలు ప్రస్తుతం బాక్సాఫీస్ దగ్గర దుమ్మురేపుతున్నాయి, కంటెంట్ ను నమ్ముకొని విడుదలవుతున్న సినిమాలు మంచి విజయాలను సాధిస్తున్నాయి. ఇప్పటికే చాలా చిన్న సినిమాలు సూపర్ హిట్ గా నిలిచాయి. ఇప్పుడు ఓ ఆసక్తికర సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. మహారత్న ప్రొడక్షన్స్, ఎస్‌కే పిక్చర్స్, వనిల్లా ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్‌లపై చందు శ్రీనివాస్, సురేష్ కొండేటి, మమత దేవేంద్ర ఎం సంయుక్తంగా నిర్మించిన చిత్రం 'ప్రేమనే ఊరిలో'. ఈ సినిమాకి మనోజ్ కుమార్ కథ, కథనం, దర్శకత్వం వహించారు. శ్రీరామ్, రమిక శివు, తపస్విని పూనాచ, రంగాయణ రఘు తదితరులు కీలక పాత్రల్లో నటించారు.ఇప్పటికే ఈ మూవీ టీజర్‌ను రిలీజ్ చేయగా అందరిలోనూ ఇంట్రెస్ట్‌ను క్రియేట్ చేసింది. అలాగే తాజాగా ఈ సినిమా నుంచి విడుదలైన పాటలు ప్రేక్షకుల నుండి మంచి రెస్పాన్స్ పొందాయి. సెప్టెంబర్ 25న ఈ సినిమా ప్రపంచ వ్యాప్తంగా థియేటర్స్ లో విడుదలకు సిద్ధమైంది. కేజీఎఫ్, కాంతారా వంటి చిత్రాలకు డైలాగ్స్ అందించిన హనుమాన్ చౌదరి ఈ చిత్రానికి సంభాషణలు రాశారు. ప్రముఖ గేయ రచయిత రాంబాబు గోసాల పాటలను రచించారు.సునద్ గౌతమ్ సంగీతం అందిస్తుండగా, రాజ్‌కాంత్ ఎస్.కె సినిమాటోగ్రఫీ, హర్షిత్ ప్రభు ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కథ, ప్రేమ, భావోద్వేగాలు,



మంచు మోహన్ బాబు నట వారసుడిగా తెలుగు చిత్ర పరిశ్రమలోకి మంచు మనోజ్ ఎంట్రీ ఇచ్చారు. శ్రీ సినిమాతో అడుగుపెట్టిన ఆయన, నటనకు మంచి మార్కులు అందుకున్నారు. ఆ తర్వాత వరుస సినిమాల్లో నటించి, అతి తక్కువ కాలంలోనే స్టార్ ఇమేజ్‌ను సొంతం చేసుకున్నారు. ఈజీ డూయింగ్ యాక్టింగ్‌తో ప్రత్యేకమైన ఫ్యాన్ బేస్‌ను ఏర్పరచుకున్నారు. మనోజ్ యాక్షన్ సినిమాలతో పాటు కామెడీ చిత్రాలను కూడా చేశారు. వాటిలో కొన్ని హిట్ టాక్‌ను అందుకోగా, మరికొన్ని యావరేజ్‌గా నిలిచాయి. ఆ చిత్రాలలో ఒకటి 2010లో విడుదలైన బిందాస్.ఏకే ఎంటర్‌టైనర్ బ్యానర్‌పై తెరకెక్కిన ఈ చిత్రానికి వీరు పోట్ల దర్శకత్వం వహించారు. వర్షం, నువ్వొస్తానంటే నేనొద్దంటానా వంటి చిత్రాలకు స్టోరీ అందించిన వీరు పోట్లకు దర్శకుడిగా ఇది తొలి సినిమా. కామెడీ యాక్షన్‌గా రూపొందిన ఈ మూవీ బ్లాక్‌బస్టర్ హిట్‌ను అందుకుంది. ఈ సినిమాలో జబర్దస్త్ యాంకర్ రష్మీ గౌతమ్ కూడా నటించారు. అయితే, ఈ చిత్రంలో మంచు మనోజ్‌కు జోడీగా నటించి, గిరిజ పాత్రతో తెలుగు ప్రేక్షకులకు చేరువైన ముంబై భామ షీనా షాహాబాది.ఏకే ఎంటర్‌టైనర్ బ్యానర్‌పై తెరకెక్కిన ఈ చిత్రానికి వీరు పోట్ల దర్శకత్వం వహించారు. వర్షం, నువ్వొస్తానంటే నేనొద్దంటానా వంటి చిత్రాలకు స్టోరీ అందించిన వీరు పోట్లకు దర్శకుడిగా ఇది తొలి సినిమా. కామెడీ యాక్షన్‌గా రూపొందిన ఈ మూవీ బ్లాక్‌బస్టర్ హిట్‌ను అందుకుంది. ఈ సినిమాలో జబర్దస్త్ యాంకర్ రష్మీ గౌతమ్ కూడా నటించారు. అయితే, ఈ చిత్రంలో మంచు మనోజ్‌కు జోడీగా నటించి, గిరిజ పాత్రతో తెలుగు ప్రేక్షకులకు చేరువైన ముంబై భామ షీనా షాహాబాది.షీనా షాహాబాది నేపథ్యం గురించి చూస్తే, ఆమె తల్లి బాలీవుడ్ ప్రముఖ నటి సాధనా సింగ్. తల్లి బాటలోనే ఇండస్ట్రీలోకి అడుగుపెట్టింది షీనా. తేరే సంగ్ అనే హిందీ చిత్రంలో నటిగా తన కెరీర్‌ను ప్రారంభించింది. ఆ తర్వాత తెలుగులోకి అడుగుపెట్టిన ఈ బాలీవుడ్ భామకు బిందాస్ తొలి తెలుగు సినిమా. ఆ చిత్రం తర్వాత తొలిసారిగా చిత్రంలో నటించింది. తారకరత్న హీరోగా నటించిన నందీశ్వరుడు మూవీలో కూడా కనిపించింది. ఇవే కాకుండా యాక్షన్ త్రీడీ, నువ్వే నా బంగారం, రాజశేఖర్ గెడ్డం గ్యాంగ్ వంటి చిత్రాల్లో నటించింది. 2015 తర్వాత షీనా టాలీవుడ్ ఇండస్ట్రీకి దూరమైంది. షీనా షాహాబాది నేపథ్యం గురించి చూస్తే, ఆమె తల్లి బాలీవుడ్ ప్రముఖ నటి సాధనా సింగ్. తల్లి బాటలోనే ఇండస్ట్రీలోకి అడుగుపెట్టింది షీనా. తేరే సంగ్ అనే హిందీ చిత్రంలో నటిగా తన కెరీర్‌ను ప్రారంభించింది. ఆ తర్వాత తెలుగులోకి అడుగుపెట్టిన ఈ బాలీవుడ్ భామకు బిందాస్ తొలి తెలుగు సినిమా. ఆ చిత్రం తర్వాత తొలిసారిగా చిత్రంలో నటించింది. తారకరత్న హీరోగా నటించిన నందీశ్వరుడు మూవీలో కూడా కనిపించింది. ఇవే కాకుండా యాక్షన్ త్రీడీ, నువ్వే నా బంగారం, రాజశేఖర్ గెడ్డం గ్యాంగ్ వంటి చిత్రాల్లో నటించింది. 2015 తర్వాత షీనా టాలీవుడ్ ఇండస్ట్రీకి దూరమైంది.

## బిందాస్ మూవీ హీరోయిన్ ఇప్పుడు ఎలా ఉందో చూస్తే మతిపోవాల్సిందే.

Printed, published &owned. By ravula rajesham printed at. JORDAR publication H.NO.2-5_146 . jammikunta.dist. karimnagar Telangana state 505122..editor.ravula rajesham, email. editor jordar@gmail.com. cellphone 7780185674 PRGi numberTG TEL/25/A5224